ఒకే దోపిడికి ఇద్దరు దొంగలు

సుంకరి రాంప్రసాద్

1979 సెప్టెంబర్ 20.

హైదరాబాద్ నిజాం వారసుడైన నిజాం షాహీ వారసత్వంగా సంక్రమించిన వజ్ర వైఢూర్యాలు, కెంపులు ముత్యాలు, రత్నాలు బంగారు, వెండి ఆభరణాలను వేలం వేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.

చారిత్రాత్మకమైన ఆ వేలం పాట సుప్రీంకోర్టు ఆవరణలో ఏర్పాటు చేయబడింది. దేశం నలుమూలల నుండీ ఎందరో కోటీశ్వరులూ, శేఠ్‌లూ ఆ పురాతన జవహారీని కొనడానికి కరెన్సీ కట్టలను పట్టుకొని సిద్ధంగా వచ్చారు.

అయితే నిజాం షాహీ అధీనంలోని ఆ అపూర్వ వస్తువు అన్నీ చారిత్రాత్మకమైనవి గనుక తమకు స్వాధీనం చేయవలసిందగా పురాతత్వశాఖ డైరెక్టర్ ఆయనకు నోటీసు జారీ చేసాడు.

వేలంలో పాల్గొనడానికి కొందరు విదేశీయులుకూడా టెండర్లు పెట్టడంతో....

ఆ అపూర్వ సంపద మన దేశాన్ని దాటిపోరాదని, అది భారతీయ సంస్కృతిలో భాగమని బొంబాయి వజ్రాల వర్తకులు కూడా ఒక కేసు నమోదు చేసారు.

ఆ వేలాన్ని తక్షణం ఆపుచేయించాలని ప్రాచీన భారత సంస్కృతి సంరక్షణా సంఘం ఆధ్వర్యంలో పెద్ద ప్రజా ప్రదర్శన జరిగింది.

ప్రజలనుండి వచ్చిన వత్తిడికి తట్టుకోలేక ప్రభుత్వం ఆ వేలంను నిషేధించింది.

నిజాం సంపదమీద కన్నువేసి ఉంచిన ప్రపంచ ప్రసిద్ధి చెందిన అభినవ కుబేరులకు, భారతీయ వజ్రాల వర్తకులకూ ఈ నిషేధం....అశనిపాతమే అయింది.

న్యాయబద్ధంగా వీలుకాకుంటే, అన్యాయంగానైనా అమూల్యమైన ఆ సంపదను స్వంతం చేసుకోవాలనుకున్నారు కొందరు బడా శేఠ్‌లు.

ఆ క్షణం నుండీ....రహస్య మంతనాలూ, ఎత్తులూ, పైఎత్తులూ, బేరసారాలూ ప్రారంభమయ్యాయి.

చీకటి ఒడిలో లోకమంతా నిద్రించే వేళ....చీకటి ప్రపంచపు దాదాలు మాత్రం అమూల్యమైన ఆ సంపదను చేజిక్కించుకోవడానికి హడావుడి పడుతున్నారు.

2

బొంబాయి నగరం నడిబొడ్డున హాంగ్ కాంగ్ బ్యాంక్ ఉంది. (దీన్ని ఇదివరలో మర్కంటైల్ బ్యాంక్ అనేవారు) ఈ బ్యాంకులోనే ఒకనాడు భారతదేశంలోని అత్యంత సంపన్నులైన రాజుల్లో ఒకరుగా....

బ్రిటిష్‌వారు 250 లక్షల పౌనులు అప్పుగా అడగ్గా

అర క్షణంకూడా ఆలోచించకుండా అప్పటికప్పుడు ఖజానాలోంచి తీసిచ్చి బ్రిటిష్ పాలకులను విస్మయ సాగరంలో ముంచెత్తిన మహారాజుగా....

ప్రసిద్ధిగాంచిన నిజాం నవాబు సంపదలో కొంత భాగం ఈ నాటికీ భద్రంగానే ఉంది. కూర్చుని తింటే కొండలైనా కరుగుతాయంటారు.

అలా కరిగిపోగా, దాయాదులు పంచుకోగా, ప్రభుత్వం స్వాధీనం చేసుకోగా, మిగిలిన ఆయన సంపద ముందు, ఈనాటి చమురు వాణిజ్యవేత్తలయిన అరబ్ కుబేరుల ఆస్తిపాస్తులన్నీ కలిసినా సూర్యునిముందు చిన్న దీపం పెట్టినట్టే ఉంటుందంటే అది యేదో కట్టుకథలా కనిపిస్తుందే తప్ప నూటికి నూరుపాళ్ళు వాస్తవంలా కనిపించదు.

ఇంతగా ప్రసిద్ధి చెందిన నిజాం నవాబు నిజానికి చాలా సామాన్యమైన జీవితాన్ని కోరుకున్నాడు.

ఆయన నివసించిన గది పది, పన్నెండు అడుగులకు మించి ఉండదు. శాఖాహార భోజనం. పళ్ళూ తప్ప ఆడంబర భోజనం ఆయనకు అలవాటు ఉండేది కాదు. ఎప్పుడూ పాతవి, లేదా మాసిన దుస్తులే ధరించేవాడు.

అయితే అతనిని పిసినారిగా అభివర్ణించే వారికి కనువిప్పు కలిగించే వాస్తవం ఒకటి వుంది. మైసూర్, బరోడా, గ్వాలియర్, కాశ్మీర్ మహారాజుల తరువాత బ్రిటిష్ వారిచేత ఇరవై ఒక్క సార్లు శతఘ్నుల గౌరవ వందనానికి నోచుకున్న మహారాజు నిజాం నవాబు ఒక్కరే.

అందుకు కారణం ఏమిటి?

ఏడవ నిజాంగా ప్రసిద్ధి చెందిన ఈ నిజాం నవాబు

తన ఆస్తిలో చాలా భాగాన్ని పేదల సంక్షేమ కార్యక్రమాల కోసం వినియోగించారు.

ఆసుపత్రులు, విద్యాసంస్థల నిర్మాణం వంటి సంక్షేమ పథకాలకు ఆయన చేసిన ఖర్చులకు ప్రత్యక్ష సాక్ష్యాలను ఈనాటికీ మనం ఢిల్లీ, బొంబాయి, హైదరాబాద్ వంటి నగరాల్లో చూడవచ్చు.

అయితే తన రాజవంశ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఆయన వాణిజ్య రంగంలో కూడా పెట్టుబడులు పెట్టారు.

స్వాతంత్ర్యం వచ్చిన ఇరవై ఒక్క సంవత్సరాల తరువాత ఆయన ఎనభై ఒక్క ఏళ్ళ వయసులో వయోవృద్ధుడుగా మరణించాడు.

ఆయన చనిపోయేనాటికి మిగిలిన సంపదలో చాలా భాగం ఇప్పటికీ లెక్కలోకి రాకుండా సమాధానం దొరకని ప్రశ్నలా మిగిలిపోయింది. ఆయన గురించి ఇప్పుడు ప్రచారంలో ఉన్న విషయాల్లో కట్టుకథలేవో, వాస్తవాలేవో తెలియని పరిస్థితి ఏర్పడింది.

ఒకనాడు ఆయన రాజప్రాసాదం అలంకరణలో.... ఆయన సంపదలో భాగంగా కుప్పలకొద్దీ పోసి వున్న వజ్రాలు, కెంపులు, ఇంద్రనీలాలు, పచ్చలు, ముత్యాలు, పాత పేపర్ల కట్టల మధ్య ఉన్న నగదు కట్టలు లండన్‌లోని పేవ్ మెంట్ల మీదకు తరలి వెళ్ళాయని అంటూంటారు.

వాటి నిజమైన విలువ తెలిసిన వారెవరైనా క్షణంలో కోటీశ్వరుడు కావడానికి అవకాశాలు యేర్పడ్డాయి. అలా కోటీశ్వరులయినవారు కూడా చాలామందే ఉంటారని ఒక అంచనా.

నిజాం తండ్రి....అంటే ఆరవ నిజాం టేబిల్ పై ఒక

పేపర్ వెయిట్ ఉండేది. అది కేవలం గాజుతో తయారుకాబడిన పేపర్ వెయిట్ అనుకుంటే మాత్రం పొరపాటే!

గోల్ఫ్‌బాల్ పరిమాణంలో ఎనిమిది కోణాలుగా వున్న వజ్రం అది. ప్రస్తుతం బ్రిటన్ రాణి కిరీటంలో చోటుచేసుకొన్న కోహినూర్ వజ్రంకన్నా అది 75 కేరట్లు ఎక్కువ. అంటే అది మొత్తం 184 కేరట్ల వజ్రం.

'జాకబ్ డైమండ్' అని పిలిచే ఈ వజ్రాన్ని ఆరవ నిజాం 1901 లో కలకత్తాలో ఒక యూదు వర్తకుని వద్ద ఆ కాలంలో 60 లక్షలు పెట్టి కొన్నాడట!

రూపాయి విలువ సుమారు 16.08 పైసలకు పడి పోయిన ఈ రోజుల్లో దాని విలువ ఎంత వుంటుందో లెక్కించగలిగితే సిరి తరగని నిజాం ఖజానా విలువ ఏపాటిదో తెలుస్తుంది.

ఏడవ నిజాం కూడా ఆ వజ్రాన్ని పేపర్ వెయిట్ గానే వాడుకున్నాడు. అతడు చనిపోయాక మాత్రం ఆ వజ్రం, నిజాం వాడి పారేసిన చెప్పుల దొంతరల మధ్య పడివుండగా కనుగొన్నారు.

ఇది ఆయన సంపద సాగరంలో ఒక చిన్న నీటిబొట్టు మాత్రమే!

నిజాంవద్ద మూడడుగుల ఎత్తు వున్న ఒక బంగారు వృక్షం వుండేది. దానికి అన్నీ వెండి ఆకులు, బంగారు పండ్లు! ఆయనవద్ద ఏనుగు దంతంతో చేసిన చదరంగపు బల్ల, వజ్రాలు, వైఢూర్యాలు పొదిగిన బంగారు పావులు వుండేవి.

ఉదాహరిస్తే ...యిలాంటి అమూల్య వస్తువులు

యెన్నో!

నామమాత్రంగా ఎనిమిదవ నిజాంగా పిలువబడే ముకర్రంజాకు తెలియని సంపదే యెంతో వుందేదట. మిగిలిన వజ్ర, వైఢూర్యాలు, కెంపులు, పచ్చలను కూడా తాను రెండుసార్లు మాత్రమే చూశానని ఆయన అంటూ ఉంటారు.

3

'హోటల్ మదీనా'

ఫ్లొరొసెంట్ లైట్ షేడ్‌లో కొట్టొచ్చినట్లు కనిపిస్తోన్న సైన్‌బోర్డును చూసి టక్కున ఆగాడు జానీ.

వత్తుగా దుబ్బులా పెరిగిన గడ్డం. నల్లని పెద్ద పెద్ద గాగుల్స్, నుదుటిపైకి జారినట్లు పెట్టుకొన్న కేప్.... అన్నీ కలసి అతని ముఖాన్ని చాలావరకు కవర్ చేస్తున్నాయి. తలపై చిన్న కేప్‌ను మరింత క్రిందకు లాక్కుంటూ ఆ హోటల్ లోనికి అడుగు పెట్టాడు.... అతడు.

కరోల్ బాగ్ మెయిన్ రోడ్ ప్రక్కనున్న సందులో వుంది ఆ హోటల్. ఇరవై నాలుగు గంటలూ అలగా జనంతో క్రిక్కిరిసి ఉండే చౌకబారు హోటల్.... అది.

హాల్లోనికి అడుగు పెడుతూనే ఓసారి చుట్టూ పరికించి చూశాడతడు. కౌంటర్‌కు కాస్త దూరంలో హాలుకు కుడివైపున కనిపించాయి అతనికి మేడపైకి పోయే మెట్లు. చకచకా అడుగులు వేసుకుంటూ మెట్లపైకి నడిచాడతడు.

సన్నగా. పొడుగ్గా వున్న నడవాకు ఇరువైపులా వున్న

రూమ్ నెంబర్లను చూసుకుంటూ వెళుతున్నాడు అతడు. తనకు కావాల్సిన నెంబరుగల రూమ్ యెక్కడుందో అడిగి—అనవసరంగా ఎవరి దృష్టిలోనూ పడటం ఇష్టం లేదు అతనికి.

రెండవ ఫ్లోర్ లో దొరికింది అతడు వెతుకుతున్న గది '203.' ఆ గది నెంబరును మరోసారి పరీక్షగా చూశాడతడు.

ఒకసారి చుట్టూ చూసి, తనను యెవరూ గమనించటంలేదని ధృవపరచుకున్నాక, మునివేళ్ళతో మెల్లగా ఆ గది తలుపులను తట్టాడు.

"ఎవరది?" గదిలో నుండి ఒక బొంగురు గొంతు వినవచ్చింది.

"జానీ!" అన్నాడతడు.

తలుపులు తెరుచుకున్నాయి. అతడు లోనికి ప్రవేశించాడు.

గది మధ్యలో వేసివున్న కుర్చీలో కూర్చొని తీరిగ్గా విస్కీని సేవిస్తోన్న లాల్ అతన్ని చూసి పలకరింపుగా నవ్వాడు.

"కూర్చో జానీ."

తెరిచిన తలుపులను క్లోజ్ చేస్తూ బొంగురు గొంతుతో అన్నాడు శంభుమిత్ర.

కుర్చీని ముందుకు లాక్కొని కూర్చున్నాడు జానీ. మరో గ్లాసులో సగంవరకూ బాటిల్ లోని విస్కీని పోసి అతని ముందుకు తోశాడు లాల్. ఫ్లాస్క్ లో నుండి రెండు ఐస్ క్యూబ్స్ ను తీసి గ్లాసులో వేసుకున్నాడతడు.

"ఎప్పుడూ ఫైవ్ స్టార్ హోటల్స్ లో విహారంచేసే

మీరు ఈసారి ఈ గల్లీ హోటల్‌లో మకాం వేశారంటే — యేదో పెద్ద చేపకే ఎర వేశారన్నమాట.

చెప్పండి దోస్తు!

ఏమిటి విషయం? ఎందుకు నన్నింత అర్జంటుగా పిలిపించారు?"

—గ్లాసులోని విస్కీని మెల్లగా చప్పరిస్తూ అడిగాడు జానీ. అతని వంక మెచ్చుకోలుగా చూశాడు శంభుమిత్ర.

"ఫైవ్ స్టార్ హోటల్స్ అన్నింటిపైనా పోలీసులు మాటువేసి వుంచారు జానీ! అందుకే ఇలాంటి చౌకబారు హోటల్లో కలియాల్సి వచ్చింది."

తనుకూడా వారిద్దరి ప్రక్కనున్న మరో కుర్చీలో సెటిల్ అవుతూ అన్నాడు శంభుమిత్ర.

'చిల్లర నేరస్తులూ, పేట రౌడీలూ సంచరించే— మదీనా లాంటి గల్లీ హోటల్స్‌ను విడిచిపెట్టి ఢిల్లీ పోలీసులు ఫైవ్ స్టార్ హోటల్స్‌పై నిఘా వేశారంటే.... ఏదో పెద్ద నేరమే జరగబోతూందని ఊహిస్తున్నారన్నమాట వారు.

అంటే....తన అంచనా తప్పు కాదంటే, చీకటి రాజ్యంలోని చాలా పెద్ద తలకాయులే ఢిల్లీ నగరంలో తిష్ట వేసి వుండాలి.

పోలీసులనూ, నేరస్థులనూ ఇంతగా ఆకర్షిస్తున్న ఆ బంగారు ఎర యేమిటి?'

మరి కాస్త విస్కీని గ్లాసులోకి వంచుకుంటూ.... ఆలోచిస్తున్నాడు జానీ.

అతని మనసులోని ఆలోచనలను చదివినట్లుగా, నవ్వాడు లాల్.

"నిజాం నవాబు ఖజానా గురించి ఎప్పుడయినా విన్నావా జానీ?"

చెళ్ళున ఎవరో అరచేతితో ముఖంమీద చరిచినట్లనిపించింది అతనికి. తాగుతూన్న విస్కీ పొలమారింది....

'కోట్ల రూపాయల విలువచేసే అపూర్వమైన నిజాం సంపదను విక్రయించటాన్ని నిషేధిస్తూ ప్రభుత్వం చేసిన ఉత్తరువును ఆ రోజా ఉదయమే పేపర్లో చదివాడతడు.

"ప్రస్తుతానికి ప్రభుత్వం ఆ నిజాం ఖజానాను పురావస్తుశాఖ ఆధ్వర్యంలో వున్న మ్యూజియంలో వుంచింది జానీ! ఢిల్లీ ప్రజలు తిలకించడం కోసం మరో రెండు రోజులు మాత్రం ఆ ఖజానా మ్యూజియంలో వుంచబడుతుంది. తరువాత సేఫ్టీ లాకర్స్‌లో భద్రపరచడానికి రిజర్వ్ బాంక్‌కు తరలిస్తారట ఆ సంపదను."

చెప్పటం ఆపి జానీ వంక ఓరగా చూశాడు లాల్.

"సో! వుయ్ షుడ్ స్నాచ్ దట్ ట్రెజరీ బిఫోర్ దీజ్ టూ డేస! యామ్ ఐ రైట్ ఫ్రెండ్స్?" సాలోచనగా తల పంకిస్తూ అడిగాడు జానీ.

అయితే అది అంత సులువైన పనేమీ కాదని అతనికి తెలుసు.

పురావస్తుశాఖ ఆధ్వర్యంలో వున్న ఆ మ్యూజియంకు ఎలాంటి సెక్యూరిటీ ఏర్పాట్లు వుంటాయో అతనికి తెలియంది కాదు. ఆ మ్యూజియం ఫోటోగ్రఫీ అతని కళ్ళముందు ఒక్కసారి లీలగా కదలాడింది.

చాందినీ చౌక్ రోడ్‌లో విశాలమైన కాంపౌండ్ మధ్య కట్టబడి వుంది ఆ మ్యూజియం.

పది అడుగుల ఎత్తయిన పటిష్టమయిన రాతి ప్రహరీ. దానిపై మరో మూడడుగుల ఎత్తున్న ఐరన్ ఫెన్సింగ్. తాకిన అరక్షణంలో ఆ మనిషిని మాడ్చి, బొగ్గులా చేయగల్గేంతటి శక్తివంతమైన ఓల్టేజ్ గల విద్యుత్ ఇరవై నాలుగు గంటలూ ఆ ఫెన్సింగ్‌లో ప్రవహిస్తూ వుంటుంది.

ప్రహరీకి, మెయిన్ బిల్డింగ్‌కూ మధ్యనున్న ఖాళీ స్థలంలో నాలుగు బ్లడ్ హౌండ్స్ తిరుగుతూ వుంటాయి. నాలుగడుగుల ఎత్తుతో, చిన్నసైజు పెద్దపులుల్లా వుండే ఆ బ్లడ్ హౌండ్స్—పరాయి మనిషి ఆ ప్రాంగణంలో కనిపిస్తే చాలు....కోరలతో కండలు చీల్చి, చెండాడుతాయి.

మెయిన్ బిల్డింగ్ పైనున్న టవర్‌లో యిద్దరు గార్డ్స్ కాపలా వుంటారు. మెర్క్యురీ లైట్ల వెలుగులతో పట్టపగలులా ఉండే ఆ బిల్డింగ్ ఆవరణలో అనుమతి లేకుండా ఎవరైనా ప్రవేశించడానికి ప్రయత్నిస్తే, నిర్దాక్షిణ్యంగా కాల్చిపారేస్తారు వారు.

వీరుగాక మెయిన్ గేటుదగ్గర ఇద్దరు గార్డ్స్. మెయిన్ బిల్డింగ్ చుట్టూ ఆరుగురు గార్డ్స్...పహారా తిరుగుతూ వుంటారు.

మ్యూజియంలోపల అమూల్యమైన వస్తువు లుంచబడ్డ గాజు షెల్ఫ్‌లకు అలారం బెల్స్ అమర్చబడి వున్నాయి. వాటిపై చేయి వేసిన మరుక్షణం.... చెవులు చిల్లులు పడేలా మ్రోగటం ప్రారంభిస్తాయి ఆ ఎలక్ట్రిక్ అలారమ్స్.

ఇన్ని కట్టుదిట్టమైన రక్షణ ఏర్పాట్లతో దుర్భేద్యంగా విలసిల్లే ఆ మ్యూజియంలోకి ప్రవేశించి ఆ నగలను దొంగ

లించడమంటే మాటలు చెప్పినంత సులువేం కాదని అతనికి తెలుసు.

"దానికో అద్భుతమైన ప్లాన్ వేసి వుంచాను జానీ!" అన్నాడు లాల్. అతని మనసులోని ఆలోచనలను చదివి నట్లుగా చిన్నగా నవ్వుతూ.

"చెప్పు!" అన్నట్లు చూశాడతడు.

"ఈ రోజు దుర్గాష్టమి!

చాందినీచౌక్ సెంటర్‌లో ప్రతిష్ఠించారు ఒక దేవీ విగ్రహాన్ని. గత వారం రోజులుగా దేవీ నవరాత్రులను మహావైభవంగా జరుపుతున్నారు చాందినీచౌక్ ఏరియా ప్రజలు.

రేపు నవమి! అంటే ఆఖరి రోజన్న మాట! రేపు ఆ విగ్రహాన్ని నీటిలో నిమజ్జనం చేస్తారు.

నిమజ్జనానికి ముందు దేవీ విగ్రహన్ని పురవీధుల్లో ఊరేగిస్తారు. మిగిలిన ఏరియాలను కవర్ చేసి, మ్యూజియమ్ ఉన్న రోడ్డులోనికి ఆ ఊరేగింపు వచ్చేసరికి, రాత్రి పదకొండు గంటలు దాటుతుంది.

సరిగ్గా ఆ సమయానికి...."

....లో గొంతుతో లాల్ వివరిస్తున్న ఆ అద్భుతమైన ప్లాన్‌ను చెవులప్పగించి మరీ వినసాగారు జానీ, శంభుమిత్ర.

4

"నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ సేకరించిన ఈ అమూల్య ఆభరణాలను, పురావస్తు కళాఖండాల చట్టం (1972) క్రింద ప్రభుత్వ నిర్బంధంగా స్వాధీనం చేసుకోవడం, న్యాయశాస్త్రరీత్యా సమ్మతమే!"

—రిఫర్ చేస్తున్న లావుపాటి బౌండ్ బుక్‌లో నుండి

తల యెత్తి, ముక్కుమీదకు వాలుతున్న కళ్ళజోడును యెగదోసుకుంటూ అన్నాడు లాయర్ బలరామ్.

"అంటే.... ఆ ఆభరణాలను వేలం వేసే అవకాశమే లేదంటారా....?" అసహనంగా అడిగాడు షేక్ ముస్తాఫా.

"బహుశ వుండకపోవచ్చు ముస్తాఫా! వారసులైన నిజాంషాహీ కోర్టుకు అప్పీల్ చేసినా, కోర్టు తీర్పు కూడా బహుశ ప్రభుత్వానికి అనుకూలంగానే రావచ్చు.

197 లో సవరించబడ్డ పురావస్తు, కళాఖండాల చట్టం అలాంటిది.

అథవా.... తీర్పు నిజాంకే అనుకూలంగా వచ్చి మళ్ళీ వేలం జరుగుతుందని అశిద్దామన్నా అది మళ్ళీ ఎప్పుడో మా దేశ్యవాటికి కదా!"

అర్థంకానట్లు తనవంక చూస్తున్న షేక్‌ను చూసి చిన్నగా నవ్వాడు బలరామ్.

"ఇది ఇండియా ముస్తాఫా!

కోర్టులోని ఒక కేసు పరిష్కరింపబడాలంటే మా దేశంలో కనీసం మూ దేళ్ళయినా పడుతుంది. అందుకే కోర్టు కెక్కినవాడూ, గాడిదెక్కినవాడూ ఒక్కటేనని సామెతను చెప్పుకుంటూంటారు ఇక్కడి ప్రజలు" గట్టిగా నవ్వుతూ అన్నాడతడు.

"త్రీ ...ఇయర్స్!" అంటూ అసహనంగా తల విదిల్చాడు ముస్తాఫా.

"ఇంతకూ ఆ అమూల్య ఆభరణాలలో మీరు దేనిని కొనాలనుకుంటున్నారు ముస్తాఫా?"

"జాకబ్ డైమండ్‌ను. అయినా ఏదయితేనేం

లెండి. చేతికి అందకపోయాక" నిరుత్సాహంగా అన్నాడు ముస్తాఫా.

"అరబ నిజాం ఆ వజ్రాన్ని ఆ రోజుల్లో 60 లక్షలకు కొన్నాడు. ఈ రోజులలో దాని విలువ సుమారు నాలుగు కోట్లు చేస్తుంది.

ఇప్పుడు చెప్పండి ముస్తాఫా! అమూల్యమైన ఆ వజ్రానికి మీ రెంత మూల్యం చెల్లించగలరు?"

—ముస్తాఫా ముఖంలోని భావాలను ఓరకంట గమనిస్తూ అడిగాడు బలరామ్.

"పుట్టని బిడ్డకు పేరు పెట్టినట్లు వేలం వేయని వజ్రానికి విలువ కట్టడం ఎందుకు భాయ్! అయినా అడిగారు కనుక చెబుతున్నాను. ఎంత ఖరీదయినా చెల్లించి, ఆ కోర్ డైమండ్‌ను నా స్వంతం చేసుకుందామనుకున్నాను.

... ఆఖరికి అయిదు కోట్లయినా సరే!"

ముస్తాఫా వంక ముచ్చటపడుతూ చూశాడు బలరామ్.

'కోట్లకొలదీ పెట్రోడాలర్లు అయాచితంగా వచ్చిపడే ఆ అరబ్ షేకులకు డబ్బంటే కేర్ లేదని, తాము మెచ్చి, తమ మనసుకు నచ్చే వస్తువును స్వంతం చేసుకోడానికి ఎన్ని కోట్ల దీనారాలనయినా వెచ్చించడానికి వారు వెనుకంజవేయరని' అతనికి తెలుసు.

"దెన్ ఇట్స్ డన్ ముస్తాఫా!

ఇప్పటికీ మీ రా ధరను చెల్లించడానికి సిద్ధంగా వుంటే ఆ వజ్రం మీ స్వంతం అవుతుంది" కూల్‌గా అన్నాడు బలరామ్.

అతని మాటలకు ఉలిక్కిపడ్డాడు ముస్తాఫా! తన శ్రవణేంద్రియాలు తనను మోసం చేస్తున్నాయేమో నన్న

అనుమానం వచ్చింది అతనికి.

ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న జాకబ్ డైమండ్ ను అంత ధీమాగా తెచ్చియిస్తానని అంటున్నాడంటే ఈ బలరామ్ సాధారణ లాయర్ అయివుండడు.

కాకుంటే ఎవరతడు?

అతనికి సడన్ గా సూట్ వాలా గుర్తుకు వచ్చాడు. ఆ రోజు ఉదయం....

ప్రభుత్వం నిజాం నగల విక్రయంపై పూర్తి నిషేధాన్ని ప్రకటించిందని తెలిసిన వెంటనే, నిరాశగా వెనక్కు మరలుతున్నాడతడు.

సుప్రీంకోర్టు ఆవరణలో ఓ మూల పార్క్ చేసివున్న తన మెర్సిడెజ్ బెంజ్ కారువైపు మెల్లగా కాళ్ళీడ్చుకుంటూ నడుస్తున్నాడతడు.

అంతలో ఒక సూట్ వాలా అతడిని పలకరించాడు.

“అపురూపమయిన నిజాం నగలు మీ స్వంతం కావాలంటే, ఒక్కసారి ఈ ఎడ్రస్ ను కాంటాక్ట్ చేయండి ప్లీజ్!” అంటూ అతని చేతికి ఒక విజిటింగ్ కార్డును యిచ్చాడు.

తెల్లని పాల తరకలాంటి విజిటింగ్ కార్డుపై తళ తళ లాడుతున్న బంగారురంగు అక్షరాలు.

‘లాయర్ బలరామ్’

ఆ పేరునూ, అందలి ఎడ్రస్ నూ చదివాక ‘ఈ లాయర్ కూ, ఈ నిజాం నగలకూ సంబంధం ఏమిటని’ ఆ సూట్ వాలాను అడుగుదామనుకొని తల ఎత్తి చూశాడతడు.

కాని, అతడు కనిపించలేదు.

క్షణంలో ఎటో మటుమాయమైపోయాడా సూట్

వాలా. అతడు అసహనంగా చుట్టూ చూశాడు.

అతని మనసులో అతనికి తెలియకుండానే ఏదో ఆరాటం బయలుదేరింది.

కనులకు గంతలు కట్టి, వెనుక నుంచి వెన్ను తట్టి, పట్టుకు చిక్కక, చేతికి అందక అల్లరిగా చిందులేసే దొంగాటలోని చిలిపి నేస్తంలా....

తెలిసినట్లే తెలిసి, తెలియకుండా పోయే విషయాన్ని తెలుసుకుందామని మనసు పడే ఆత్రం అది.

ఆ ఆత్రంతోనే బలరామ్‌ను కలిశాడు. నిజాం నగల వేలానికి సంబంధించిన లీగల్ క్లూ ఏదో చెబుతాడు కామోసు ఆ లాయర్ అనుకున్నాడతడు.

కాని ఇదేమిటి యిలా....

ఆలోచనల్లో పడి కొట్టుకుపోతున్న ముస్తాఫాను చూసి చిన్నగా నవ్వాడు బలరామ్

ఢిల్లీలో మాఫియా రింగ్‌లోని అతి కీలకమైన వ్యక్తులలో బలరామ్ ఒకడని- కాకలుతీరిన నేరస్థులెందరో అతని కనుసన్నలలో నడుస్తూంటారని.... ఎక్కడో అరబ్ దేశాల నుండి వచ్చిన షేక్ ముస్తాఫాకేం తెలుసు.

అయితే ముస్తాఫాకు ఒక్కటి మాత్రం తెలుస్తూంది. 'వారు కోరిన మూల్యం చెల్లించగలిగితే అమూల్యమైన ఆ వజ్రం తన స్వంతం అవుతుంది. అదీ రాజమార్గంలో కాకుండా.... దొడ్డి దారిలో.'

అదే సమయంలో....

బూట్లను టకటక లాడించుకుంటూ ఆ గదిలోకి వచ్చాడొక యువకుడు. సన్నగా, కిలాడీ లాగున్నాడు అతడు.

"రా! సలీమ్! రా! నీ కోసమే యెదురుచూస్తున్నాను...." అంటూ సాదరంగా ఆహ్వానించాడు బలరామ్.

ఆ యువకుని వంక ఆశ్చర్యంగా చూస్తూన్నాడు ముస్తాఫా. అతని వంక చూసి పలకరింపుగా నవ్వాడతడు.

సుప్రీంకోర్టు ఆవరణలో ముస్తాఫాను కలిసి, బలరామ్‌ను కలియుమని సలహా యిచ్చిన నూట్ వాలా ఎవరో కాదు సాక్షాత్ ఆ యువకుడే.

"బేరం సెటిల్ అయింది సలీమ్! రేపు రాత్రికి జాకబ్ డైమండ్‌ను నీవు ముస్తాఫాకు అందజేయాలి.

అన్నట్లు ముస్తాఫా! అడగటమే మరిచాను. ఇంతకూ ఆ వజ్రాన్ని మీకు ఎక్కడ అప్పగించాలి?"

బజార్లో పేవ్ మెంట్ మీద దొరికే యేదో గాజు పాత్రను కొని, అందించాలన్నంత సులువుగా చెబుతున్న బలరామ్‌వంక తెల్లబోతూ చూశాడు ముస్తాఫా.

"రేపు నవమి సలీమ్!

నవరాత్రి ఉత్సవాల్లో చివరి అంశమయిన నిమ్మజ్జనోత్సవం రేపే! నిమ్మజ్జనానికి ముందు దేవీ విగ్రహాన్ని వీధులలో ఊరేగిస్తారు మిగిలిన ప్రాంతాలను చుట్టి ఆ ఊరేగింపు మ్యూజియం రోడ్డులోకి వచ్చేసరికి రాత్రి పది కొండుగంటలు దాటుతుంది.

సరిగ్గా ఆ సమయానికి...."

బలరామ్ వివరిస్తు్న్న ప్లాన్‌ను వింటూంటే ముస్తాఫాకు కర, చరణాలు కదలడం మానేశాయి. భయంతో అతని గొంతు ఎండిపోయింది.

అతడిని మరింతగా భయపెడుతున్నది వారి తెగువ!

'జరుపబోయే దోపిడీ గురించి పరాయి మనిషి సమక్షంలో....అంత నిర్భయంగా వారు మాట్లాడుకుంటున్నారంటే వారి తెగువ ఎంతటిదో సులువుగా అర్థం అవుతూంది అతనికి.

ఇక తాను పదవి విప్పలేడు. విప్పితే....! ఎప్పుడో ఎక్కడో విన్నాడతడు ఎవరి నోటనో....

తమకు ద్రోహం చేయటానికి ప్రయత్నించేవారికి మాఫియా విధించే శిక్షేమిటి!

అది: మరణశిక్ష!'

ఆ ఊహ రాగానే చిగురుటాకులా గజగజ వణికిపోయాడు ముస్తాఫా.

5

మహార్నవమి!

దేవీ నవరాత్రోత్సవాలలో చివరిఘట్టమైన నిమ్మజ్జనోత్సవం ప్రారంభమయింది.

పూలరథంలా అలంకరించబడిన మోటారు ఛాసీపై దేవీ విగ్రహాన్ని ఉంచారు. విద్యుద్దీపాల ధగధగలతో నింగి నుండి నేలకు దిగివచ్చిన పాలపుంతలా వెలిగిపోతూంది ఆ ఉత్సవ రథం.

త్రొక్కిసలాడుకుంటున్న వేల కొలది భక్తజన సందోహంతో ఊరేగింపు ప్రారంభమయింది.

ఓ ప్రక్క మంగళతూర్య నాదాలు, మరోప్రక్క జానపద వాద్యాల ఘోష.

విచిత్ర వేషాలూ, జానపద నాట్యాలు, సాముగరడీలు, నేల వేషాలూ, బల్ల వేషాలూ, పులి ఆటలూ.... కన్నులపండుగగా వుంది ఆ ఊరేగింపు.

మరి కొద్ది నిముషాలలో ఆ ఊరేగింపు మ్యూజియం

రోడ్డును సమీపిస్తుంది అనగా.... ఆ రోడ్డులోనికి సర్రున దూసుకుంటూ వచ్చిందొక లేలెండ్ లారీ.

ఇద్దరు ఉత్సవ కార్యకర్తలు రోడ్డుకు అడ్డం పడుతూ, పరుగెత్తుకొని వెళ్ళి ఆ లారీని ఆపారు.

"ఏమిటి భాయ్?" తలను బైటకు పెడుతూ విసుగ్గా అడిగాడు ఆ లారీ డ్రయివర్.

"రాస్తా బంద్ భాయ్! దుర్గామాత ఊరేగింపు వస్తూంది. ఈ రూట్‌లో వాహనాలు పోవడానికి వీల్లేదు" అన్నాడొక వాలంటీర్.

దుర్గామాత పేరు వింటూనే, డ్రయివర్ ముఖంలోని విసుగు మంత్రించినట్లు మాయమైపోయింది. కన్నులు అరమోడ్చి, చేతులు పైకెత్తి, కనుపించని ఆ దుర్గామాతకు మనసులోనే నమస్కరించాడతడు.

లారీని రోడ్డుకు ప్రక్కగా తీసి పార్క్ చేశాడు. ఇంజన్‌ను ఆపి క్రిందకు దిగాడు. రోడ్డు అంచున వున్న డ్రయినేజీ రంధ్రానికి సరిగ్గా పైన ఆపబడివుంది ఆ లారీ.

పెద్ద పెరుగుబుట్టనొకదాన్ని జాగ్రత్తగా కేబిన్‌లో నుండి క్రిందకు దించాడు ఆ లారీ క్లీనర్.

"మతాబాలు భాయి సాబ్! దుర్గామాత ప్రీతికోసం అందరం తలా ఒకటి ఆనందంగా కాల్చుదాం"—ఆ బుట్టవంక ఆశ్చర్యంగా చూస్తున్న వాలంటీర్లతో నవ్వుతూ అన్నాడా డ్రయివర్.

జాతరలలో అమ్మవారి గుడిముందూ, ఉత్సవ, ఊరేగింపులలోనూ మందుగుండు కాలుస్తామని మ్రొక్కుకునే వారిని చాలామందిని చూశారు వారు. ఆ ఊరేగింపులో ఆ డ్రయివర్ లాంటి వారు కొన్ని వందలమంది రోడ్డు పొడుగునా మందుగుండు కాలుస్తూ తమ మ్రొక్కుబడు

లను తీస్తుకుంటారని వారికి తెలుసు.

అయితే, 'ఊరేగింపు ఆగోడ్డులో వస్తాందనికూడా తెలియని ఆ డ్రయివర్, ప్రముఖ్యబడిని తీసుకోవడానికి బుట్టలో మతాలు లెందుకు తెచ్చి ఉంటాడని?' ఆలోచించలేకపోయారు వారు.

అతని వంక నవ్వుతూ చూసి "అచ్ఛా భాయి! వస్తా!" అంటూ ముందుకు నడిచారు వారు.

వారక్కడ నిలబడి మాట్లాడుకుంటూ ఉండగానే, లారీ కేబిన్ లోనుండి ఒక వ్యక్తి మెల్లగా క్రిందకు దిగి, చప్పుడు చేయకుండా పాములా ప్రాకుకుంటూ లారీ క్రిందకు పోయాడు.

వారు మరో పది అడుగులు ముందుకు పోగానే.... అటూ, ఇటూ ఒక్కసారి చూసి, తను కూడా చటుక్కున లారీ క్రిందకు మూరాడు ఆ లారీ క్లీనర్.

తాళ్ళ దగ్గరున్న బుట్టను చూస్తూ అసహానంగా దుబ్బుగా పెరిగిన గడ్డాన్ని బరుకున్నాడు ఆ డ్రయివర్.

లారీ క్రింద....

డ్రయినేజీ రంధ్రానికి బిగించి వున్న కప్పును ఊడదీపి, ఆ రంధ్రంగుండా లోనికి దిగాడు మొదటగా లారీ క్రిందకు చేరిన వ్యక్తి. ఆ దేక్షణంలో ఆ లారీ క్లీనర్ కూడా ఆ రంధ్రాన్ని సమీపించాడు.

"కమాన్ శంభూ! క్విక్!" అన్నాడతడు లో గొంతుతో.

"ఒక్క నిమిషం లాల్!" అంటూ ఆ క్లీనర్ కూడా ఆ డ్రయినేజ్ లోనికి దిగాడు.

లాల్ జేబులోనుండి పెన్ టార్చ్‌ను తీసి వెలిగిం

చాడు. క్లీనర్ వేషంలో ఉన్న శంభుమిత్ర చేతిలో చిన్న సైజు డ్రిల్లింగ్ మెషీన్ వుంది. గనులలో పని చేసే కార్మికులు గోడలకు రంధ్రాలు చేయడానికి ఉపయోగించే యంత్రం అది.

లాల్ టార్చి వెలుగును ముందుకు ఫోకస్ చేశాడు. పెద్ద భూ సొరంగంలా ఉంది ఆ డ్రయినేజీ. మోకాటి లోతువరకూ ఉంది అందులోని మురుగునీరు. చిక్కగా, జిడ్డుగా ఉన్న ఆ కుళ్ళు నీటిలో మెల్లగా అడుగులు వేసుకుంటూ ముందుకు నడిచారు వారు.

బురదతో కూడిన అడుసులో వారి పాదాలు దిగబడి పోతున్నాయి. భరించలేని దుర్గంధం వారి ముక్కు పుటాలకి సోకుతూ, కడుపులోని ప్రేవులను మెలిపెట్ట సాగింది. ఈ క్షణమో, మరుక్షణమో వాంతి వచ్చే టట్టుంది వారి పరిస్థితి. 'ఝుం' అంటూ దోమలు ముసురు కుంటూ విసురుగా వారి ముఖాలను తాకుతున్నాయి.

అయినా....పళ్ళబిగువున ఆ నరకాన్ని భరిస్తూ.... ముందుకు నడుస్తున్నారు వారు.

కొంతదూరం అలా నడిచాక, లాల్ ఆగి జేబులో నుండి ఒక ప్లాన్ కాగితాన్ని పైకితీశాడు. టార్చిలైట్ వెలుగులో దాని వంక పరీక్షగా చూశాడు. ప్లాన్ ను మడిచి జేబులో పెట్టుకున్నాడు. మరో పది అడుగులు ముందుకు నడిచి ఆగాడు. అతని వెనకనే నడుచుకుంటూ వచ్చాడు శంభుమిత్ర.

"శంభూ! యిక ప్రారంభించు."

"డ్రెయినేజి పైభాగాన ఒక ప్రదేశాన్ని చూపుతూ అన్నాడు లాల్.

చేతిలోని డ్రిల్లింగ్ మెషిన్ ను ఆన్ చేసి, డ్రయినేజి

ఉపరితలానికి అనించాడు శంభుమిత్ర. చిన్నగా శబ్దం చేస్తూ ఆ భాగాన్ని దొలవటం ప్రారంభించింది ఆ యంత్రం.

బయట....

లారీ ముందు డ్రయివర్ వేషంలో నిలబడ్డ జానీ అసహనంగా చుట్టూ చూశాడు.

గువ్వల్లా రివ్వుమంటూ నింగికి ఎగురుతున్న తారాజువ్వలు దోసిళ్ళతో వెలుగు పువ్వులను విరజిమ్ము తున్నాయి. టపాసుల శబ్దంతో ఆ ప్రదేశమంతా మార్మోగిపోతూంది. ఊరేగింపు మెల్లగా ఆ వీధిలోనికి ప్రవేశించింది.

ఊరేగింపును చూసి తేలిగ్గా నిట్టూర్చాడు జానీ. వాళ్ళ దగ్గరున్న వెదురుబుట్ట మూతను తీదదీశాడు. మతాబాలు, టపాసులు దాని నిండుగా నీట్ గా పేర్చ బడి వున్నాయి.

రెండు జెయింట్ సైజు సీమటపాకాయ గుత్తులను పైకితీసి పట్టుకున్నాడతడు. కర్ణభేరీలు పగిలేలా శబ్దం చేస్తూ, ఒక్కొక్కటి పదినిముషాల సేపు ఏకధిగిని ఆగ కుండా ప్రేలే పటాసులవి.

వాటివంక నవ్వుతూ చూశాడతడు.

అయితే....ఆ లారీ ఆ వీధిలోనికి ప్రవేశించినప్పటి నుండి, తమ ప్రతి కదలికనూ వేయి కళ్ళతో ఒక వ్యక్తి గమనిస్తున్నాడని....అతనికి తెలియదు.

అందుకే అంత ధీమాగా నవ్వుకుంటున్నాడతడు.

ఆ వ్యక్తి....రోడ్డుప్రక్క నున్న పేవ్ మెంట్ పై చింకిగోనె పట్టాను పరచుకొని, పడుకున్న ఒక ముసలి భిక్షగాడు.

'లారీ క్రిందకు దూరిన ఆ పెద్దమనుషులు యిద్దరూ, సుమారు పది నిముషాలు కావస్తున్నా, బయటకు రాకుండా చేస్తున్న రాచకార్యమేమిటి? అనుకున్నాడా వృద్ధ భిక్షువు.

మెల్లగా పైకి లేచి గోనెపట్టాను చుట్టి, చేతికర్రను తాటించుకుంటూ ముందుకు నడిచాడు.

ఆ వీధిని విడిచి ప్రక్క వీధికి పోతున్నాడు గాబోలు ననుకుంటారు అతనిని చూస్తున్నవారు. సరిగ్గా జానీ కూడా అలాగే అనుకున్నాడు.

సూటిగా ఇరవై గజాల దూరం పోయాక నిదానంగా రోడ్డు క్రాస్ చేశాడా భిక్షుగాడు. మళ్ళీ వచ్చిన రోడ్డుగుండానే వెనక్కు మరలాడు.

అయితే ఒక్కటే తేడా! అంతకు క్రితం రోడ్డుకు కుడిప్రక్క నడిచాడు. ఇప్పుడు ఎడమప్రక్క నడుస్తున్నాడు. జానీవాళ్ళు వచ్చిన లారీ, రోడ్డుకు యెడమ వైపునే ఆపబడి వుంది.

ఆ భిక్షుగానికీ, తనకూ మధ్య లారీ అడ్డుగా వుండటం వలన, వెనక్కు తిరిగివస్తున్న ఆ భిక్షుగాడిని గమనించలేదు జానీ.

లారీని సమీపించాడు ఆ భిక్షుగాడు. అటూ, ఇటూ చూసి ఛటుక్కున లారీ క్రిందకు దూరాడు.

కాని, ఆ లారీ క్రింద యెవరూ లేకపోయేసరికి ఆశ్చర్యపోయాడతడు.

"ఏమయ్యారు వీరిద్దరూ?

తను చూస్తూనే వున్నాడు. లారీ క్రిందకు దూరాక వారు బయటకు రాలేదు. మరెలా మాయమైపోయారు

వారు?"

అసహనంగా తల విదిలిస్తూ, మరి కాస్త లోపలకు ప్రాకుతుంటూ పోయాడతడు.

మూడడుగులు ముందుకు వెళ్ళగానే అతని మనసును ఆవరించిన అనుమానం మంచులా విడిపోయింది. ఎదురుగా తెరచి ఉన్న డ్రయినేజీ రంధ్రాన్ని చూసేసరికి వారిద్దరూ ఎలా మాయమైపోయారో అర్థం అయింది అతనికి.

అయితే దుర్గంధ భూయిష్టమైన ఆ మురికి కూపంలోకి వారెందుకు దిగారో అర్థంకాలేదు అతనికి.

ఆ రంధ్రం వంకే చూస్తూ తీవ్రంగా ఆలోచించసాగాడు. సరిగ్గా రెండు నిముషాల తరువాత అతని మెదడులో మెరిసినట్లనిపించింది.

భూగర్భంగుండా పోయే ఆ డ్రయినేజీ మార్గం ఏ దిక్కులో పోతూందో గుర్తుకు వచ్చేసరికి అతని ముఖం మ్లానమయింది.

ఆ డ్రయినేజ్ సరిగ్గా మ్యూజియం భవనం క్రింద నుండే పోతుంది.

'అంటే ఆ మురుగు కాలువద్వారా మ్యూజియం లోనికి ప్రవేశించడానికి ప్రయత్నిస్తున్నారా వారు?

ఆ ఆలోచన వచ్చాక ఒక్కక్షణం కూడా తాత్సారం చేయలేదతడు. వచ్చినంత వేగంగానే ఆ ప్రదేశాన్ని వీడి వెళ్ళిపోయాడతడు.

మ్యూజియమ్ రోడ్‌ను దాటి, ప్రక్క వీధిలోనికి వెళ్తే ఎదురుగా సాక్షాత్కరిస్తుందొక పెద్ద పార్కు. రాత్రి పదకొండు గంటలు దాటటం వలన నిర్మానుష్యంగా ఉంది ఆ పార్కు. సూటిగా ఆ పార్కులోకి నడిచాడు ఆ భిక్షగాడు.

గుబురుగా వున్న ఒక పొద చాటుకు పోయాడతడు. చుట్టూ ఒకసారి కలియజూసి, ఆ చుట్టుప్రక్కల ఎవరూ లేరని ధృవపరచుకున్నాక, జేబులోనుండి ఒక వస్తువును పైకి తీశాడు.

అది....అరచేతిలో ఇమిడే మినీ వైర్‌లెస్ సెట్. దానికున్న చిన్న బటన్‌ను నొక్కగానే బీప్....బీప్... మంటూ చిన్నగా శబ్దం చేయసాగిందది.

6

కొన్ని గంటలు వెనక్కు వెళ్ళితే!

ఆ రోజు ఉదయం....

ఢిల్లీ కమీషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయంలో.

ఎదురుగా కుర్చీలలో కూర్చున్న పోలీస్ ఆఫీసర్ల వంక పాలోచనగా చూశాడు. పోలీస్ కమీషనర్. ఒక్కసారి చిన్నగా దగ్గి గొంతును సవరించుకున్నాడు.

"డియర్ ఆఫీసర్స్!

ఉపోద్ఘాతాలు లేకుండా సూటిగా అసలు విషయానికి వస్తాను.

అమూల్యమైన నిజాం నగల అమ్మకాన్ని నిషేధిం చింది మన ప్రభుత్వం! ఎంత ధరైనా చెల్లించి, వేలం పాటలో వాటిని తమ స్వంతం చేసుకోవాలని ఆశించిన కొందరో బడా శేఠ్‌లకూ అరబ్ షేక్‌లకూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం గొడ్డలి పెట్టు అయింది.

అలా అని, వారు చేతులు ముడుచుకు కూర్చుంటారని నేను అనుకోను. న్యాయబద్ధంగా వీలుకాకుంటే. అన్యా యంగానైనా అపురూపమైన ఆ నగలను పొందడానికి ప్రయత్నిస్తారు వారు.

దొంగలను శేఠ్‌లే కాంటాక్ట్ చేసి వుంటారో, లేక

షేక్‌లను దొంగలే కాంట్రాక్టు చేసి వుంటారో! ఏది యేమయినా, నా అంచనా తప్పుకాకుంటే....

చాందినీ చౌక్ రోడ్డులోనున్న మ్యూజియంను కన్నం వేసి, ఆ నగలను కొట్టేయడానికి, ఈసరికే ఢిల్లీలోని గజదొంగలంతా కలలుకన్ని వుంటారు.

ఆ అనుమానంతోనే ఢిల్లీలోని అన్ని పెద్ద హోటల్స్ పైనా నిఘా వేసి వుంచారు మన పోలీసులు. అయితే ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే....

కరెన్సీ నోట్లను చిత్తుకాగితాల్లా ఖర్చుచేస్తూ, స్టార్ హోటల్స్‌లో విలాసంగా గడిపే నొటోరియస్ క్రిమినల్స్, మాఫియా ముఠా సభ్యులు... ఒక్కరు, ఒక్కరంటే ఒక్కడు కూడా ఆ హోటల్స్‌లో కనిపించటం లేదు.

నిన్న రాత్రినుండి మంత్రం వేసినట్లు మాయమై పోయారు వారంతా? ఏమైపోయారు? ఎక్కడకు పోయారు వారంతా?

తుఫానుకు ముందు సముద్రంలో ఏర్పడే ప్రశాంతత లాంటి పరిస్థితి ప్రస్తుతం ఢిల్లీ నగరంలో నెలకొని వుంది.

సంథింగ్ ఈజ్ రాంగ్ సమ్‌వేర్!

ఎక్కడో, ఏదో జరుగబోతూంది. ప్రస్తుతానికి మన కళ్ళ యెదురుగా కన్పిస్తున్నవి మాత్రం మ్యూజియంలో నున్న నిజాం నగలు!

అదీగాక చాందినీ చౌక్ ఏరియా ప్రజలు నిర్వహిస్తున్న దేవీ నిమజ్జనోత్సవం, ఈ రోజు రాత్రి పదకొండు గంటల ప్రాంతంలో.... సరిగ్గా మ్యూజియం వీధిలో నుండే పాస్ అవుతుంది.

సో! బీ ఎలర్టు మైడియర్ ఆఫీసర్స్! ముఖ్యంగా

మ్యూజియం ఏరియాను వెయ్యి కళ్ళతో వాచ్ చేయండి"

చెప్పటం ఆపాడు పోలీస్ కమీషనర్.

ఫార్మల్ గా తీసుకోవాల్సిన జాగ్రత్తల గూర్చి మరి కొద్ది నిమిషాల సేపు డిస్కస్ చేశాక, కమీషనర్ కు సెల్యూట్ చేస్తూ ఆ గదిలోనుండి నిష్క్రమించారు ఆ ఆఫీసర్లు.

అంతవరకూ ప్రక్క గదిలో కూర్చుని, వారి మధ్య నడిచిన సంభాషణంతా శ్రద్ధగా ఆలకిస్తున్న ఒక యువకుడు స్వింగ్ డోర్స్ ను తెరుచుకుంటూ ఆ గదిలోనికి అడుగుపెట్టాడు.

అతని వంక ప్రసన్నంగా చూశాడు కమీషనర్.

"రా! రాంకుమార్! రా! కూర్చో!" అంటూ సాదరంగా ఆహ్వానించాడతడు.

కుర్చీలో రిలాక్స్ గా సెటిల్ అయ్యాక,

"మీ మాటలన్నీ విన్నాను కమీషనర్ సాబ్! కాని మ్యూజియం సెక్యూరిటీలాంటి ఇంత చిన్న విషయం కోసం మీరు సి. బి. ఐ. ను కాంటాక్టు చేసి వుంటారని నేననుకోను.

మీరు యింతకు క్రితం చెప్పినట్లు....

సంథింగ్ ఈజ్ రాంగ్ సమ్ వేర్! ఎక్కడో, ఏదో జరుగబోతూంది.

నా అంచనా తప్పుకాకుంటే యూ గాట్ దట్ క్లూ! చెప్పండి కమీషనర్ సాబ్!

మీ డిపార్టుమెంట్ అధికార్లకు కూడా చెప్పకూడని ఆ రహస్యం ఏమిటి? ఇంత అర్ధంతరంగా యెందుకు నన్ను పిలిపించినట్లు?" కూల్ గా అడిగాడు రాంకుమార్.

అతని తార్కిక జ్ఞానానికి ఆశ్చర్యపోయాడు కమీ

వసర్. అనతికాలంలోనే సి.బి.ఐ.లో స్టార్ ఏజెంట్ గా రాంకుమార్ ఎందుకు పేరు తెచ్చుకున్నాడో అప్పుడు అర్థం అయింది అతనికి.

ఒక్కసారి చిన్నగా నిట్టూర్చి చెప్పటం ప్రారంభించాడతడు.

“రాంకుమార్!

మీకు తెలిసే వుంటుంది. ఈమధ్య ఢిల్లీలో హెరాయిన్, ఎల్.ఎస్.డీ. లాంటి మాదక ద్రవ్యాల బెడద ఎక్కువగా వుంది. ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా ఆ మత్తుపదార్థాల రవాణాను అరికట్టలేక పోతున్నాం.

చివరకు ఈ మాదక ద్రవ్యాల చలామణిని అరికట్టేందుకు ఒక స్పెషల్ స్క్వాడ్ ను నియమించటం జరిగింది.

ఢిల్లీ మాఫియా రింగ్ లోని ఒక మూల స్తంభంగా అనుమానింపబడుతున్న బలరామ్ ఈ మాదక ద్రవ్యాల రవాణాలో ముఖ్య పాత్రధారి అని వారి పరిశోధనలో తేలింది.

అనుమానం పై అరెస్టు చేయడానికి బలరామ్ సామాన్యుడు కాదు. కోటీశ్వరుడు. నగరంలో పేరుపొందిన క్రిమినల్ లాయర్. గొప్పగొప్ప రాజకీయ నాయకులతో సన్నిహిత సంబంధాలున్న వ్యక్తి. అలాంటివానిపై తగిన సాక్ష్యాధారాలు లేకుండా రెయిడ్ చేస్తే అభాసుపాలవుతాం.

ఇక, పరిశోధనలో తేలిన రెండో విషయం:

సుమారు నూరుకోట్ల రూపాయల విలువచేసే మాదక ద్రవ్యాలు రెండురోజుల క్రితమే ఢిల్లీకి రహస్యంగా దిగుమతి అయ్యాయి. ఈ రోజో, రేపో అవి మిగిలిన

ప్రాంతాలకు పంపిణీ చేయబడతాయి.

అయితే, ఎంత ప్రయత్నించినా, ఆ మాదక ద్రవ్యాలు దాచబడ్డ స్థలాన్ని మాత్రం కనిపెట్టలేక పోయారు మావాళ్ళు.

ఏం చేయాలో తోచక ఈ రోజులాగానే ఢిల్లీలోని పోలీస్ అధికారుల నందరినీ పిలిచి, ఈ సిట్యుయేషన్ను ఎలా టాకిల్ చేయాలా అని డిస్కస్ చేస్తున్నాం"—

అంతలో మమ్మల్ని డిస్టర్బ్ చేస్తూ, నా టేబిల్ పైనున్న రెడ్ టెలిఫోన్ మ్రోగింది.

ఈ సమావేశం పూర్తయినంత వరకూ, నన్ను డిస్టర్బ్ చేయకుండా, నాకు వచ్చే ఫోన్ కాల్స్ అన్నింటికీ తనని ఎటెండ్ కమ్మని నా సెక్రటరీకి ఆదేశించాను నేను.

'నా ఆదేశాన్ని అతిక్రమించి మరీ, ఈ కాల్ నాకు డైరక్ట్ చేయబడిందంటే, అదేదో అత్యవసరమైన మెసేజ్ అయి ఉంటుంది' అనుకుంటూ రిసీవర్ను ఎత్తాను నేను.

పాలెం ఎయిర్పోర్టు ఏరియాలోని ఇన్స్పెక్టర్ సంతోష్ దగ్గరనుండి వచ్చిన ఫోన్ కాల్ అది.

'ఢిల్లీ నగర శివార్లలో నున్న ఒక పాత గోడౌన్లో ఆ మాదక ద్రవ్యాలున్నట్లు తాను కనుగొన్నాననీ, మమ్మల్ని వెంటనే బయలుదేరి అక్కడకు రమ్మనీ, అంత వరకూ తాను అక్కడే వుండి, వాచ్ చేస్తూంటాననీ' చెప్పాడు ఇన్స్పెక్టర్ సంతోష్.

జరిగిన విషయాన్ని ఆ అధికారులకు వివరించాను నేను. బలగంతో వెంటనే బయలుదేరి సంతోష్ చెప్పిన స్పాట్కు చేరుకున్నాను.

కాని ఆశ్చర్యం!

అక్కడ ఖాళీగా వున్న గోడౌన్ సాక్షాత్కరించింది నాముందు. ఓ మూల రక్తపు మడుగు మధ్య విగతజీవురై పడివున్నాడు ఇన్ స్పెక్టర్ సంతోష్.

'తన వెనుక బలగం ఏమీ లేదని తాను ఒంటరిగానే, ఒక వ్యక్తిని వెన్నాడుతూ ఆ ప్రదేశానికి చేరుకున్నానని' నాతో ఫోన్‌లో చెప్పాడు సంతోష్.

మేము వచ్చేటంత వరకూ తొందరపడి వారిని ఎదుర్కొనడానికి ప్రయత్నించవద్దని హెచ్చరించాను నేను.

నా హెచ్చరికను పాటించి, అతనెక్కడో దాక్కొనే ఉండి. వుంటాడు. మరి. దాక్కున్న అతనిని శత్రువులు వెతికి మరీ ఎలా పట్టుకోగల్గారు?

అసలు అతడి గురించి వెతకాల్సిన అవసరం వారికేం వచ్చింది? అతడక్కడ దాక్కున్నట్లు వారికి తెలిసి ఉండాలి.

పోనీ, యింకో రకంగా ఆలోచిస్తే....

ఏదో ఏక్సిడెంటల్ గా వారి దృష్టిలోపడ్డ సంతోష్‌ను వారు అంత మొందించారే అనుకుందాం.

కాని, ఇంత అర్థాంతరంగా, కేవలం కొన్ని నిముషాలలో హడావుడిగా ఆ గోడౌను ఖాళీచేసి వెళ్ళిపోవాల్సిన అవసరం వారికేం వచ్చింది?

ఇట్ మీన్స్ దె స్మెల్ట్ ద డేంజర్!

అంటే, పోలీసులు ఆ గోడౌన్ పై రెయిడ్ చేయబోతున్నట్లు వారికి తెలిసి వుండాలి.

ఎలా తెలుస్తుంది?

నాకూ, సంతోష్‌కూ, నా గదిలోనున్న పోలీస్ అధికారులకూ తప్ప ఇతరులకు ఈ రెయిడ్ గురించి తెలిసే

అవకాశం లేదు.

అంత కాన్ఫిడెన్షియల్‌గా, కేవలం కొద్ది నిము షాలలో నిర్ణయం తీసుకొని, చేసిన రెయిడ్ గురించి కూడా, శత్రువులు తెలుసుకోగల్గారు అంటే... ఖచ్చితంగా మాలోనే ఎవరో శత్రువుల ఇన్‌ఫార్మర్ ఉండి తీరాలి.

మాలో యెవరిని నమ్మాలో యెవరిని నమ్మకూడదో తెలియని పరిసితి

ఈ సితిలో యేం చేయాలో తోచక, మీ బాస్ కరుణాకర్‌ను కాంటాక్ట్ చేశాను" చెప్పటం ఆపి ముఖా నికి పట్టిన చెమటను తుడుచుకున్నాడు కమీషనర్.

"ఇంతకూ...నూరుకోట్లు విలువ చేసే ఆ మాదక ద్రవ్యాలు యేమయినట్లు? యెక్కడ వున్నట్లు?" తనకు తానే ప్రశ్నించుకున్నట్లు సాలోచనగా అన్నాడు రాంకుమార్.

నవ్వుతూ భుజాలను ఎగురవేశాడు కమీషనర్. 'అదే తెలిస్తే ఈ బాధంతా యెందుకు?' అన్నట్లుంది అతన్ని నవ్వు.

"ఒక్క విషయం మాత్రం ఖచ్చితంగా చెప్పగలను రాంకుమార్.

ఆ మాదక ద్రవ్యాలు ఢిల్లీ సిటీని మాత్రం దాటి బయటకు పోలేదు. ఢిల్లీ బార్డర్స్ నన్నింటినీ వేయి కళ్ళతో పెట్రోల్ చేస్తున్నారు మా వాళ్ళు.

సిటీలోపల కూడా...

అనుమానం వున్న సెంటర్స్‌లోనూ, గల్లీలోనూ గట్టి నిఘా యేర్పాటు చేశాం. హెరాయిన్ లాంటి మత్తు పదా ర్థాలు సేవించిన వ్యక్తులను కస్టడీలోకి తీసుకొని, వారికి మాదక ద్రవ్యాలు యెలా లభించాయో ఆరాలు తీయ

మని అన్ని స్టేషన్సుకు స్ట్రిక్టు ఆర్డర్స్ జారీ చేశాం.

స్టిల్ వాట్ ఎల్స్ యూ ఎక్స్‌పెక్టు ఫ్రం మి?" ఉద్వేగపూరితమైన కంఠంతో అన్నాడు కమీషనర్.

'నిజమే! యెవరు కూడా అంతకన్నా యేమీ చేయ లేరు.

అన్ని కట్టుదిట్టాలు చేసినా, అంత అష్ట దిగ్బంధనం గావించినా, యింకా నేరస్తులు హాయిగా తమ కార్య కలాపాలను కొనసాగిస్తున్నారంటే అది అతని తప్పు కాదు___'

ఒక క్షణం తరువాత ఆలోచనల్లో నుండి తేరుకొని, "వెల్ సర్! ఆ గోడౌన్‌లో అనుమానించదగ్గ ఆధారాలేం లభ్యం కాలేదా?" సూటిగా కమీషనర్ కళ్ళలోకి చూస్తూ అడిగాడు రాంకుమార్.

లేదన్నట్లు తలాడించాడు కమీషనర్.

"కాని, ఇన్‌స్పెక్టర్ సంతోష్ శవం ప్రక్క నేల మీద మూడు అక్షరాలు కనిపించాయి. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతూ, అతి కష్టంమీద వ్రాయబడినట్లు వంకర టింకరలతో అలికినట్లున్నాయి___ఆ రక్తాక్ష రాలు.

అతని శవం పడివున్న భంగిమను బట్టి. అతని కుడిచేతి చూపుడు వ్రేలుకు అంటిన రక్తాన్ని బట్టి, వాటిని వ్రాసింది అతడేనని స్పష్టంగా తెలుస్తోంది."

"ఏమిటా అక్షరాలు కమీషనర్ సాబ్!"

"న....వ....మి....!" ఒక్కొక్క అక్షరాన్ని ఒత్తి పలుకుతూ అన్నాడతడు.

"నవమి" మెల్లగా ఆ అక్షరాలను మననం చేసు కుంటూ వాటిలో దాగివున్న క్లూ ఏమిటా అని ఆలో

చించసాగాడు రాంకుమార్.

"యస్....నవమి!

ఈ రోజు నవమి, మహార్నవమి. ఈ రోజును దృష్టిలో వుంచుకొనే అతడు ఆ అక్షరాలను వ్రాసి వుంటాడని భావిస్తున్నాను నేను. అందుకే ఈ రోజు, యెక్కడో యేదో జరగబోతోందని నా అనుమానం!...."

—ఒక గొప్ప రహస్యాన్ని ఛేదించినట్లు వెలిగిపోతున్న ముఖంతో అన్నాడు కమీషనర్.

కాదన్నట్లు అడ్డంగా తలాడించాడు రాంకుమార్.

"కేవలం ఈ రోజు యెక్కడో యేదో జరగబోతూందని చెప్పడం పెద్ద ఇన్ఫర్మేషన్ కాదు.

తన ఆఖరిక్షణాలలో కూడా అంత కష్టపడి, ఆ అక్షరాలను వ్రాకాడంటే, వాటిద్వారా అతడు చెప్పదల్చుకున్నది అంత చిన్న 'క్లూ' అయివుండదు.

ఇంకేదో వుంది.

అదీగాక, ఈ రోజు యేదో జరగబోతూందని చెప్పాలంటే, ఈ రోజు తేదీ వ్రాస్తారు. లేదా, సోమవారం అనో, మంగళవారం అనో వారం పేరు వ్రాస్తారు. అంతే గాని....'నవమి, దశమి' అంటూ తిథుల పేర్లు వ్రాయరు కదా!"

అతని లాజిక్‌కు ముగ్ధుడవుతూ అతనివంక మెచ్చుకోలుగా చూశాడు కమీషనర్.

ఒక క్షణం ఆగి మళ్ళీ చెప్పటం ప్రారంభించాడు రాంకుమార్.

"నూరు కోట్ల రూపాయల విలువజేసే మాదకద్రవ్యాలు ఢిల్లీలోకి దిగుమతి అయినట్లు మనకు తెలుసు

అవి ఈ రోజో, రేపో మిగిలిన ప్రాంతాలకు పంపిణీ చేయబడతాయి అని కూడా మనకు తెలుసు.

కాని, మనకు తెలియందల్లా....

అవి యెప్పుడు, యెక్కడ, యెలా పంపిణీ చేయబడతాయనేదీ!

ఇన్‌స్పెక్టర్ సంతోష్ చెప్పాడిందీ, పొంచి వుండి గమనించిందీ, ఆ మాదకద్రవ్యాల ముఠానే! చనిపోయే నాటికి, అతడు డీల్ చేస్తున్నది ఆ ఎసైన్‌మెంట్‌నే.

ఫోన్‌లో అతడు మీతో మాట్లాడిన దానిని బట్టి, ఆ మాదకద్రవ్యాలు యింకా పంపిణీ చేయబడలేదు, దెంర్ స్టిల్ స్టోర్డ్ ఇన్ గోడౌన్.

సో! అతడు చెప్పదలుచుకున్నది ఖచ్చితంగా ఆ మాదకద్రవ్యాల గురించే అయివుంటుంది. అవి ఎప్పుడు, ఎక్కడ పంపిణీ చేయబడతాయో శత్రువుల మాటల ద్వారా అతడు గ్రహించి వుంటాడు. ఆ రహస్యాన్నే చిన్న 'క్లూ' ద్వారా మనకు చెప్పటానికి ప్రయత్నించాడు.

అతడిచ్చిన క్లూ....'నవమి!'

మీ రన్నట్లు యీ రోజు నవమి....మహర్నవమి! మ... హా....ర్న....వ....మి!"

—అక్షరాలను గుణించుకుంటూ ఆలోచిస్తున్న రాంకుమార్ మెదడులో యేదో మెరిసినట్లయింది. ట్యూబ్‌లైట్‌లా వెలిగిపోయింది అతని ముఖం.

"మహర్నవమి అంటే.... దేవీ నవరాత్రి ఉత్సవాల్లో చివరిదినం. విమిజ్జనోత్సవం జరిగే రోజు.

కమీషనర్ సాబ్!

తెలిసిపోయింది. ఆ మాదకద్రవ్యాల పంపిణీ....నవమి

వాడు. అంటే ఈ రోజు దేవీ నిమజ్జన ఉత్సవంలో జరగబోతూంది."

అతనవంక తెల్లబోతూ చూశాడు కమీషనర్. పోలీస్ శాఖకూ, ఇంటలిజన్స్ శాఖలకూ మధ్య, ఆలోచించే విధానంలో యెంత తేడా వుంటుందో ఆ క్షణంలో స్పష్టంగా తెలిసింద అతనికి.

నిమజ్జనోత్సవం అనగానే చాందినీచౌక్ ఏరియాలోని మ్యూజియంరోడ్ గుర్తుకు వచ్చింది వారిద్దరికీ.

మ్యూజియం రోడ్డు అనగానే, నిజాం నగలు గుర్తుకు వచ్చాయి.

మరో అయిదు నిముషాలసేపు యేదో దీర్ఘంగా చర్చించుకున్నారు వారు.

"సో! వస్తాను కమీషనర్ సాబ్!

మీరు అనుక్షణం అప్రమత్తంగా వుండాలి. గుర్తుందిగా మన కోడ్ .... ఈగల్!"

కుర్చీలో నుండి లేచి నిలబడి నవ్వుతూ కమీషనర్ తో కరచాలనం చేస్తూ అన్నాడు రాంకుమార్.

ఆకాశంలో చక్కర్లు కొడుతూ కూడా, భూమిమీద దాక్కున్న కమ ఎరలను గుర్తుపట్టి రివ్వున దూసుకు వచ్చి, క్షణంలో ఎగుర వేసుకుపోతాయి ఈగల్స్!

ఠీవిగా నడుచుకుంటూ పోతున్న రాంకుమార్ ను చూస్తూంటే.... ఆ ఈగిలే గుర్తుకు వచ్చింది కమీషనర్ కు.

7

"ఊరేగింపు వచ్చేస్తుంది!" స్వగతంలో అనుకున్నట్లు మెల్లగా అన్నాడు సలీమ్.

"మనవాళ్ళంతా సిద్ధంగా వున్నారు బాస్!"

మ్యూజియంరోడ్డులోకి అప్పుడే ప్రవేశించిన ఉత్సవ

జనసందోహాన్ని చూస్తూ అన్నాడు సలీం ప్రక్కనే నిల
బడ్డ వ్యక్తి.

క్రిక్కిరిసి వున్న భక్తజనుల మధ్య కలిసిపోయి, అమాయకుల్లా నడుస్తోన్న తన సహచరుల వంక తృప్తిగా చూశాడు సలీమ్.

పురావస్తుశాఖ మ్యూజియమ్‌కు వెనుకవైపు నున్న రెండంతస్తుల భవంతిలోని ఒక గదిలో కిటికీ ప్రక్కన నిలుచుని వున్నారు వారు.

అతని చేతిలో టెలిస్కోపిక్ గన్ వుంది. దానికి సైలన్సర్ బిగించబడి వుంది. మ్యూజియం పైనున్న టవర్‌లో పహారా తిరుగుతున్న ఇద్దరు గార్డ్సువంక తదేకంగా చూస్తున్నాడతడు.

తలలు నరికే ముందు, గొర్రెలవంక కసాయివాడు చూసే చూపది.

ఆ రెండవ వ్యక్తి మెల్లగా కిటికీలో నుండి బయటకు వచ్చి, టెర్రస్ పై జాగ్రత్తగా నడుచుకుంటూ, ఆ బిల్డింగ్ అంచుకు చేరుకున్నాడు.

ఆ భవనం గోడప్రక్కనే వుందొక ఎలక్ట్రిక్ పోల్ — ఇప్పుడు అతడు సరిగ్గా చేయి చాస్తే అందేంత దూరంలో.

అతని చేతులకు రబ్బర్ గ్లోవ్స్ తొడుక్కున్నాడు. అతని కాళ్ళకు రబ్బరు బూట్లు వున్నాయి. జేబులో నుండి పట్టకారు వంటి సాధనాన్ని పైకి తీసాడతడు.

ఎటువంటి లోహంతో తయారుకాబడ్డ వైరు నయినా అవలీలగా క్షణంలో కత్తిరించగల కటింగ్ ప్లేయర్ అది.

ఆ విద్యుత్ తీగలవంక ఆకలిగా చూశాడతడు. వాటిని కత్తిరించిన మరుక్షణం.... మ్యూజియంతో సహా ఆ వీధి

అంతా అంధకార బంధురమయిపోతుందని అతనికి తెలుసు.

అక్కడ....వీధిలో....

అట్టహాసంగా ప్రవేశించిన ఊరేగింపును చూసి, ఒక్కసారి చేతికున్నా వాచీవంక చూసుకున్నాడు డ్రయివర్ వేషంలో ఉన్న జానీ.

"యస్! ఇట్స్ ద టైమ్!" అనుకున్నాడు అతడు.... చేతిలోని టపాసులను ముట్టించడానికి ఉద్యుక్తుడవుతూ....

అతని ముందున్న బుట్టలోని మందుగుండు సామగ్రిని చూస్తూనే, తాయిలం కోసం ఎగబడే పిల్లల్లా ఆ బుట్ట మీద పడ్డారు కుర్రకారు.

మతాబాల వెలుగులతోనూ, టపాసుల ధ్వనులతోనూ ఆ వీధి మార్మోగిపోయింది.

క్రింద....డ్రయినేజ్‌లో —

డ్రిల్ చేయగలిగినంత మేరా భూమికి రంధ్రం చేసి, ఆ పైన డ్రిల్లింగ్ సాధ్యంకాక....ఆ రంధ్రంలో చిన్న సైజు బాంబు నొకదాన్ని ఫిట్ చేసి వుంచారు లాల్, శంభుమిత్ర.

బయట నుండి టపాసుల శబ్దం వినిపించగానే ఆ బాంబు వత్తిని ముట్టించారు.

వారికి తెలుసు....వీధి బయట పేలుతున్న టపాసుల శబ్దంలో యీ బాంబు శబ్దం కలిసిపోతుందని.... ముఖ్యంగా జానీ కాల్చే ఆ రెండు పెద్ద సీమటపాసుల శబ్దంలో!

రెండు చెవులనూ మూసుకుంటూ కొంతదూరం ముందుకు పరుగెత్తుకుపోయారు వారు.

సరిగ్గా ముట్టించిన ముప్పయి సెకనుల తరువాత కర్ణభేరులు బద్దలయ్యేలా శబ్దం చేస్తూ పేలింది బాంబు.

పెద్ద పెద్ద పెచ్చులు ఊడి డ్రయినేజ్ లో పడ్డాయి. నేల విచ్చుకొని పెద్ద రంధ్రం ఏర్పడింది. భూగర్భం నుండి మ్యూజియం భవనంలోకి మరో సొరంగ మార్గం తయారయ్యింది.

విస్ఫారిత ముఖాలతో ఆ సొరంగ మార్గం వంక చూశారు వారు.

అదే సమయంలో....

ఒక్క క్షణంలో....ఎలక్ట్రిక్ పోల్ కున్న వైర్లను కత్తిరించాడు.... టెర్రస్ పై నిలబడ్డ ఆ వ్యక్తి.

ఒక్కసారిగా ఆ ప్రదేశాన్ని అంధకారం అలుముకుంది. అదే క్షణంలో సలీమ్ చేతిలో నున్న టెలిస్కోప్ రైఫిల్ సైలెంట్ గా రెండుసార్లు మ్రోగింది.

రెండు కిలోమీటర్ల దూరంలో నున్న టార్గెట్ ను సైతం ఖచ్చితంగా ఛేదించగల శక్తివంతమైన రైఫిల్ అది. దాని గురి తప్పే ప్రసక్తే లేదు.

ఒక గార్డు నుదుటిలో నుండి దూసుకుపోయిందొక గుండు. మరో గార్డు గొంతును ఛిన్నాభిన్నం చేసింది మరో గుండు. అంతే! విగతజీవులై నేల వ్రాలిపోయారు వారు.

మరుక్షణం కిటికీలో నుండి బయటకు వచ్చి టెర్రస్ మీదుగుండా మేడ అంచుకు చేరుకున్నాడు సలీమ్.

పాకెట్ లో నుండి చిన్న హుక్ లాంటి పరికరాన్ని పైకి తీశాడు. ఎస్ ఆకారంలో వుంది అది. వంకీ తిరిగిన దాని క్రింది కొక్కానికి అరంగుళాల పొడవున్న లెదర్ బెల్టు ఫిక్స్ చేయబడి వుంది.

బస్సుల్లో నిలబడ్డ ప్రయాణీకులు పట్టుకోవడానికి వీలుగా పైనున్న ఐరన్ రాడ్స్‌కు వ్రేలాడుతుంటాయి అలాంటి బెల్టులు.

అతడు చేతులకు రబ్బర్ గ్లౌస్ తొడుక్కున్నాడు. అతని వీపుపై టెలిస్కోప్ గన్ వ్రేలాడు తూంది. ఎలక్ట్రిక్ పోల్ వంక పరీక్షగా చూశాడతడు.

ఆ పోల్ నుండి మ్యూజియం టవర్ పైకి పోతున్న దాక ఎలక్ట్రిక్ వైర్. కొద్ది క్షణాల క్రితంవరకూ ఆ పోల్ నుండి మ్యూజియంకు విద్యుత్‌ను సరఫరా చేసిన తీగ అది. ఎలక్ట్రిక్ కనెక్షన్‌ను తప్పించివేయటం వలన.... ఇప్పుడది సాధారణ లోహపు తీగ మాత్రమే!

ఆ తీగను పట్టుకొని బలంగా లాగి చూశాడు. రెండు కాళ్ళనూ పైకెత్తి వ్రేలాడి చూశాడు.

“నో ప్రాబ్లమ్! ఇట్స్ ఒ.కే!” సంతృప్తిగా తలా డిస్తూ ప్రక్కనున్న వ్యక్తితో అన్నాడతడు.

అక్కడ... కొద్దిసే....

ఎప్పుడయితే ఎలక్ట్రిక్ వైర్లు కత్తిరింపబడి, అంతటా చీకటి అలుముకుందో....

ఆ క్షణం నుండీ అనూహ్యమైన సంఘటనలతో ఆ ప్రదేశమంతా అల్లకల్లోలంగా మారిపోయింది.

అంతవరకూ భక్తుల మధ్య బుద్ధిమంతుల్లా నడుస్తున్న సలీం అనుచరులు ఒక్కసారిగా నిశాచరుల్లా, పిశాచాల్లా విజృంభించారు.

ఎవరెవరివో చేతులు మొరటుగా తమ అవయవాలను తాకేసరికి కెవ్వుమన్నారు కొందరు ఆడవాళ్ళు. మెడల లోనూ చెవులకూ ధరించిన బంగారు నగలను బలవం

తింగా త్రెంచేసరికి, చర్మం కోసుకుపోయి, చెవి తమ్మెలు తెగిపోయి బాధగా ఆర్తనాదాలు చేశారు మరి కొందరు అతిథులు.

గింజాకుంటున్న తమను వాటేసుకొని, ఎగరేసి చాప చుట్టలా భుజాన వేసుకొని ఎవరో దుండగులు ఎత్తుకు పోతూండడంతో.... భయవిహ్వలులై రక్షించమని కేకలు పెట్టారు కొందరు కన్నెపిల్లలు.

అడ్డుగచ్చిన మగాళ్ళను చావబాదుతున్నారు దుండగులు. త్రొక్కిసలాట ప్రారంభమయింది.

అంతవరకూ ఆ ఊరేగింపుకు ఇరుప్రక్కలా బాడీ గార్డ్సులా నిలబడి నడుస్తూ, మరోప్రక్క జాగ్రత్తగా మ్యూజియంను వాచ్ చేస్తున్న పోలీసులు, లాఠీలనుపట్టు కొని రంగంలోకి దిగారు.

మ్యూజియం గార్డ్సు కూడా, పహారాను ఆపి, ఉత్సుకతతో ఆ మారణకాండను చూడసాగారు.

చీకటి! కన్ను పొడుచుకున్నా కనిపించని కారు చీకటి! ఎవరు, ఎవరిని కొడుతున్నారో, అర్థం కాని పరిస్థితి. కేకలు, ఆక్రందనలతో ఆ ప్రదేశమంతా మారుమ్రోగి పోతూంది.

ఇప్పుడందరి దృష్టి ఆ కొట్లాటమీదే వుంది. పోలీసులు, గార్డ్సు కూడా తాత్కాలికంగా మ్యూజియం మాటను మరచిపోయారు.

పైన.... కిందపై....

చుట్టూ ఒక్కసారి చూసి, తమను ఎవరూ గమనించటం లేదని ధృవపరచుకున్నాక....

చేతిలోనున్న కొక్కాన్ని.... మ్యూజియంకు కనెక్ట్ చేయబడిన ఎలక్ట్రిక్ వైర్‌కు తగిలించాడు సలీం. ఆ

కొక్కానికి వేలాడుతున్న బెల్టును రెండు చేతులతో గట్టిగా పట్టుకున్నాడు. గుండెలనిండా ఊపిరి పీల్చుకొని ఒక్కసారిగా ముందుకు దూకాడు.

అంతే!

రోప్ వే గుండా సాగిపోయే ట్రాలీలా రివ్వున గాలిలో ముందుకు దూసుకుపోయాడతడు.

శరీరంలోని శక్తినంతటినీ, చేతులలో కేంద్రీకరించి, గాలిలో అలా రోప్‌కు వ్రేలాడుతూ ప్రయాణించడమంటే మాటలేం కాదు. ఆ ఫీట్ చేయడానికి గుండెల్లో తెగువ వుండాలి.

ఆ ఫీట్ చేయటంలో ఎక్స్‌పర్టు కాబట్టే, సలీంను ప్రత్యేకంగా ఆ ఎసైన్‌మెంట్‌కు వినియోగించాడు బలరామ్!

కేవలం రెండు నిముషాలలో మ్యూజియం పైనున్న టవర్‌ను చేరుకున్నాడు సలీమ్.

పోలీసుల కళ్ళు కప్పగలిగాడు. మ్యూజియం గార్డ్సును ఏమార్చగలిగాడు. కాని ఆ వీధిలో ఒక మూలనున్న చెత్తకుండీ ప్రక్కన కూర్చున్న భిక్షగాని దృష్టిలో నుండి మాత్రం తప్పించుకోలేకపోయాడతడు.

కొద్ది క్షణాల క్రితం....

ప్రక్కవీధిలోని పార్క్‌లో పొదచాటు నుండి.... వైర్‌లెస్ సెట్ ద్వారా మాట్లాడినది ఆ భిక్షగాడే!

'పెద్ద చేపను పట్టడానికి చిన్న చేపను వేసినట్లు, చిన్న కల్లోలాన్ని సృష్టించి, అటు పోలీసులనూ, ఇటు గార్డ్సునూ ఏమార్చి, వారి దృష్టి అటు మరల్చి, యెంచక్కా మ్యూజియంను దోచుకో బోతున్నారు వీరు....

అందరి ఎటెన్షనూ ఇటు మరల్చి అటు హాయిగా, తీరిగ్గా తమ పనులను చక్కబెట్టుకుంటున్నారు.' అనుకున్నాడు ఆ భిక్షగాడు.

....అంతే! మరుక్షణం ఉలిక్కిపడ్డాడు.

—ఏమిటి తను అనుకున్నది?

'అందరి ఎటెన్షన్‌నూ ఇటు మరల్చి, అటు హాయిగా, తీరిగ్గా తమ పనులను చక్కబెట్టుకుంటున్నారు.'

ఏదో యథాలాపంగా అనుకున్న తన మాటలలోని గూఢార్థం అర్థమయ్యేసరికి, విపరీతమయిన ఆందోళనకు గురైంది అతని అంతరంగం.

నిజమే!

తను యింతవరకూ ఒక్క కోణంలో నుండే ఆలోచిస్తున్నాడు. నిజాం నగల దోపిడీకి సంబంధించినంత వరకూ శత్రువుల ప్లాన్స్ యేమిటో స్పష్టంగా తెలుస్తున్నాయి.

బట్, వాటెబౌట్ దట్ హెరాయిన్?

దాని పంపిణీ మాటేమిటి?

మ్యూజియం వీధిలోనే, ఆ నిమజ్జనోత్సవంలోనే, హెరాయిన్ పంపిణీ జరగాల్సివుంటే, అక్కడ ఆ అల్లరి సృష్టించబడి వుండేది కాదు.

ఆ అల్లరి సృష్టించబడింది....నిజాం నగల దోపిడీకి. మరి నిజాం నగల దోపిడీని ప్లాన్ చేసింది....?

పోలీసుల దృష్టిని ఇటు కేంద్రీకరింపచేసి ఇంకో చోట, ఏ టెన్షనూ లేకుండా హాయిగా ఆ నూరుకోట్ల రూపాయల విలువచేసే హెరాయిన్‌ను పంపిణీ చేసుకొనేందుకా?'

—ఆ ఆలోచన మనసులో మెదిలాక ఒక్క క్షణం కూడా అక్కడ నిలువలేకపోయాడు ఆ భిక్షగాడు.

వడి వడిగా నడుచుకుంటూ ఆ వీధిలోనుండి వెళ్ళిపోయాడతడు.

8

గోతిలోనుండి బయటకు వచ్చాడు లాల్. అంతవరకూ దుర్గంధభూయిష్టమైన మురికి కూపంలో మ్రగ్గిపోవటంవలన, చల్లని గాలి మెల్లగా ముఖానికి తగిలేసరికి, ప్రాణం లేచివచ్చినట్లనిపించింది అతనికి.

ఒక్కసారి హాయిగా గుండెలనిండా గాలి పీల్చుకున్నాడు. అంతే! మరుక్షణం అతని మనసులో మొలకెత్తిందొక చిన్న అనుమానం.

తమ ప్లాన్ ప్రకారం, తాము చేసిన సొరంగమార్గం సరిగ్గా మ్యూజియం మెయిన్ హాల్ కు కుడివైపు నున్న స్టోర్ రూమ్‌లోకి చేరుకోవాలి.

విరిగి పాతబడిన సామాగ్రితో, బూజులు పట్టి ముక్కు కంపుకొట్టే ఆ గదిలోకి అంత చక్కని గాలి ఎలా వస్తోంది?

అనుమానంగా చుట్టూ కలియజూశాడు.

చీకటి! అంతటా, ఆవరించుకున్న కాటుకలాంటి కటిక చీకటి!

కళ్ళు చికిలించుకొని చూశాడతడు.

అస్పష్టంగా కనిపిస్తోన్న క్రీనీడలను బట్టి, తామున్నది గదిలో కాదని, మ్యూజియం బయటనున్న ఆవరణలోనని గ్రహించటానికి అతడికి ఎంతో సేపు పట్టలేదు.

అయినా సందేహాన్ని నివృత్తి చేసుకోవడానికి చేతిలో నున్న పెన్ టార్చ్‌ను ఒక్కసారి వెలిగించా

డతడు.

అదే అతడు చేసిన తప్పు.

ఏదో క్రొత్త వాసన సోకేసరికి, ముక్కుపుటాలను ఎగుర వేస్తూ, నేలను వాసన చూస్తూ.... వారికి పైపే వస్తూందొక బ్లడ్ హౌండ్.

ఎప్పుడయితే టార్చిలైట్ వెలుగు దాని కళ్ళల్లో పడిందో, భయంకరంగా మొరుగుతూ ముందుకు దూకిందది.

నాలుగడుగుల ఎత్తులో కోరలు చాస్తూ, బ్లాక్ పాంథర్ లా వచ్చి పడుతున్న ఆ బ్లడ్ హౌండ్ ను చూసే సరికి....లాల్ కు యేం చేయాలో తోచలేదు.

జేబులోనుండి రివాల్వర్ ను తీసి, దానిని క్షణంలో అంతం చేయవచ్చు. కాని రివాల్వర్ మ్రోతను విని గార్డ్సు వచ్చే ప్రమాదం వుంది,

ఏం చేయాలో నిశ్చయించుకోలేక దెస్పరేట్ గా ముందుకు పరుగెత్తాడతడు.

పది అడుగులు వేసేసరికి, గోడ ప్రక్కగా కన్పించిందొక నీటిగొట్టం. చటుక్కున దాన్ని అందుకొని పైకి ప్రాకడం ప్రారంభించాడతడు.

ఆ క్షణంలో....తన మిత్రుడూ, సహచరుడూ శంభుమిత్ర యింకా అక్కడే ఉన్నాడన్న విషయం కూడా గుర్తుకు రాలేదు అతనికి.

డ్రిల్లింగ్ మెషిన్ ను గట్టున పెట్టి, రెండు చేతులనూ నేలకు ఆన్చి, గోతిలో నుండి తన భారీశరీరాన్ని మెల్లగా పైకి లేపుతున్నాడు శంభుమిత్ర.

అదే సమయంలో పెద్దపులిలా కోరలు చాస్తూ అతని మీద పడింది ఆ బ్లడ్ హౌండ్. ఆ అదటుకు అతడు

గోతిలోనికి జారిపోయాడు. అతనితోపాటు ఆ బ్లడ్ హౌండ్ కూడా.

కోరలు సాచి, అతని కుడి జబ్బను పట్టి విసురుగా లాగింది బ్లడ్ హౌండ్. రక్తం ఓడుతూ పట్టెసు కండ ఊడి వచ్చింది.

భరించలేని బాధతో ఆర్తనాదం చేశాడతను. గుహాలా నోరును తెరుస్తూ మరోసారి అతని మీదకు దూకిందది.

అక్కడ.... మ్యూజియంలో....

టవర్ పైనుండి, మెట్లగుండా క్రిందకు దిగాడు సలీమ్. మ్యూజియం లోపలకు, తిన్నగా మెయిన్ హాలుకు తీసుకు వెళ్తాయి ఆ మెట్లు. చివరి మెట్టును చేరాక ఆగాడతడు.

ఎదురుగా మూసి ఉన్న తలుపులు సాక్షాత్కరించాయి అతనికి. వాటికి పెద్ద గోడ్రెజ్ తాళం వ్రేలాడుతూంది.

అతడు నిదానంగా రైఫిల్ బారెల్ ను ఆ తాళం కీ హోల్ లో ఉంచి ట్రిగ్గర్ ను నొక్కాడు.

అంతే!

చిన్నగా శబ్దం చేస్తూ విడిపోయింది ఆ తాళం. మెల్లగా తలుపులను వెనక్కి త్రోసాడతడు. కిర్రున శబ్దం చేస్తూ తెరుచుకున్నాయవి.

అడుగు ముందుకు వేయబోతూ అప్రయత్నంగా ఆగిపోయాడతడు.

ఏదో శబ్దం లీలగా వినిపించసాగింది అతనికి. చెవులు రిక్కించాడతడు. ఎవరో బరువుగా ఊపిరి పీలుస్తున్న ధ్వని. నక్కి, నక్కి వస్తున్నట్లుగా, మెత్తని పాదాల సవ్వడి.

అతడు చటుక్కున గోడచాటుకు దాక్కొని, తల మాత్రం కాస్త సాచి, లోపలకు తొంగిచూశాడు.

అంతకు కొద్ది క్షణాల క్రితం....

నీటి పంపును పట్టుకొని, పది అడుగులు పైకి ప్రాకే సరికి, పంపుకు కుడిప్రక్క రెండడుగుల దూరంలో పెద్ద వెంటిలేటర్ కనిపించింది లాల్‌కు. చేయి సాచి, వెంటిలేటర్‌ను అందుకున్నాడతడు.

అది పాతకాలంనాటి మోడల్‌లో కట్టబడిన వెంటిలేటర్. దాని మధ్య అడ్డుగా ఇనుప ఊచలేం లేవు. రెండు రెక్క తలుపులు మాత్రం వేసి వున్నాయి. అవి కూడా గొళ్ళెం పెట్టి లేవు.

వాటిని మెల్లగా తెరిచాడతడు.

యింత నిర్లక్ష్యంగా, కనీసం గొళ్ళె కూడా పెట్టకుండా వీటిని ఇలా వదిలేసారేమిటి చెప్మా అనుకుంటూ ఆశ్చర్యంగా లోనికి చూశాడు.

చీకటి!

కారు చీకటి!

చేతిలోని టార్చ్‌ను నొక్కి, లోపలకు ఫోకస్ చేశాడు.

విరిగిన కుర్చీలు, చిత్రపటాలు, బూజుపట్టిన ఇతర సామాగ్రి.... చిందర వందరగా పడివున్నాయి ఆ చిన్న గదిలో.

తమ ప్లాన్ ప్రకారం, తాము చేసిన సొరంగ మార్గం చేరాల్సిన స్టోర్ రూమ్ అదేనని గ్రహించడానికి అతనికి యెంతో సేపు పట్టలేదు.

'అంటే ఈ గదికి ఎడమవైపున వుంటుందన్నమాట మెయిన్ హాల్!' అనుకున్నాడతడు మెల్లగా వెంటి

లేటర్ గుండా ఆ గదిలోకి ప్రవేశిస్తూ.

అడ్డుగా పడివున్న సామాన్లను తప్పించుకుంటూ, సవ్వడి చేయకుండా, అడుగులను తూచి తూచి వేస్తూ తలుపులను సమీపించాడు.

ఆ తలుపులకు అవైపున తాళం వేయబడి వుంది. వాటి వంక పరీక్షగా చూశాడతడు.

సగం వరకూ చెక్క, అపైన ఫ్రేములకు అద్దపు పలకలు అమర్చబడ్డ పాతకాలంనాటి తలుపులవి.

ఒక్క దెబ్బతో ఆ అద్దపు పలకలను బ్రద్దలుకొట్టవచ్చు. కావాలంటే కాస్త కష్టపడి ఆ తలుపులనే విరగ్గొట్టవచ్చు కాని, కాస్త శబ్దాన్ని కూడా చేసి, లేనిపోని రిస్కులను కొని తెచ్చుకోవడం ఇష్టంలేకపోయింది అతనికి.

జేబులోనుండి చిన్న పట్టకారును పైకితీశాడు. అద్దం పలకలు పడిపోకుండా, ఫ్రేం అంచులకు చిన్న, చిన్న పూతికె మేకులు దిగగొట్టబడి వున్నాయి. అన్నింటికన్నా దిగువగా నున్న అద్దపు పలక చుట్టూ వున్న మేకులను పట్టకారుతో నెమ్మదిగా ఊడదీశాడు. తరువాత ఆ అద్దపు పలకను కూడా తీసి, జాగ్రత్తగా క్రింద వుంచాడు.

గాజుపలక తీయబడిన స్థానంలో ఏర్పడిన ఖాళీగుండా కుడిచేతిని బయటకు పోనిచ్చాడు. ఆ తలుపులకు వేయబడ్డ తాళం అతని చేతికి అందింది.

సన్నగా పుల్లలా వున్న సాధనాన్ని ఆ తాళం కీహోల్‌లో నుంచాడు. అతని చేతివ్రేళ్ళు చురుగ్గా కదలాడుతున్నాయి. కేవలం రెండుక్షణాల్లో 'క్లిక్'మంటూ ఆ తాళం విడిపోయింది.

మెల్లగా తలుపులను తెరచి ఆ గది బయటకు

నడిచాడు.

ఒకటి.... రెండూ.... మూడు.... నాలుగు....

ఒక్కొక్క అడుగే లెక్కపెట్టి వేస్తున్నట్లుగా మెల్లగా నడిచేయకుండా ఎత్తి,ఎత్తి అడుగులను వేస్తున్న అతను చటుక్కున ఆగిపోయాడు.

ఏదో శబ్దం లీలగా వినిపించింది అతనికి. చెవులను రిక్కించాడు.

ఎవరో బరువుగా ఊపిరి పీలుస్తున్న ధ్వని. అడుగు ముందుకు వేయబోయి, ఛటుక్కున ప్రక్కకు తప్పుకున్న అలికిడి.

'సంబడీ ఈజ్ దేర్!' అనుకున్నాడు అతడు అనుమానంగా.

అంతే!

ఎక్కడ వున్నవాడు అక్కడ వున్నట్లుగానే నేల మీదకు జారిపోయి మెల్లగా ప్రాకుకుంటూ ప్రక్కనున్న స్తంభం చాటుకు చేరుకున్నాడు.

తలను మాత్రం కాస్త బయటకు సాచి తొంగి చూశాడు.

కనుపించటానికి ఏముంది అక్కడ?

కారుచీకటి తప్ప?

9

ఎక్కడ?

ఎక్కడ ఆ నూరుకోట్ల రూపాయల విలువజేసే హెరాయిన్ పంపిణీ చేయ ఁడుతూంది?

చాందినీ చౌక్‌లోని దేవీ నిమజ్జన ఉత్సవంలో కాదని తేలిపోయింది. అయితే మరి యెక్కడ?

'నవమి'కి తాను అన్వయించుకున్న అర్థం ప్రకారం...

ఈ రోజే, ఎక్కడో దేవీ నవరాత్రి ఉత్సవాల్లోనే ఆ హెరాయిన్ పంపిణీ జరిగితీరాలి.

బట్.... వేర్?—తీవ్రంగా ఆలోచించసాగాడా బిత్తు గాడు.

అతని మనోఫలకంపై ఢిల్లీలో ఎక్కడెక్కడ దేవీ నవరాత్రి ఉత్సవాలు జరుపబడతాయో ఆ ప్రదేశాలన్నీ సినిమా రీళ్ళలా కదలసాగాయి.

'ఓల్డు సిటీ.... కరోల్ బాగ్, రెడ్ ఫోర్టు, జనపథ్ పాల్కా బజార్....' ఒక్కొక్క పేరునే మననం చేసుకుంటున్నాడతడు.

'పాలం ఎయిర్ పోర్టు!' అనుకుంటూ టక్కున ఆగిపోయాడు.

ఢిల్లీ మొత్తంమీద దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగేది పాలం ఎయిర్ పోర్టు ఏరియాలోనే. ఇన్ స్పెక్టర్ సంతోష్ హత్య కావింపబడిన గోడౌన్ ఉన్నది ఆ ఏరియాలోనే! అతని ఫోన్ కాల్ ప్రకారం ఆ గోడౌన్ లోనే ఆ హెరాయిన్ స్టాక్ చేయబడింది.

అంటే! ఆ హెరాయిన్ యింకా ఆ ఏరియాలోనే ఉందా?

నిజానికి తమ దృష్టి మొదటగా ఆ యేరియామీదే పడివుండేది. కాని, ఈ నిజాం నగలనుండి తమ ఎటెన్షన్ అంతా చాందినీ చౌక్ వైపు మరలింది.

కాదు! శత్రువులు తమ దృష్టిని అటు మరలింపచేశారు? అదే నిజమయితే.... అక్కడ.... ఆ ఏరియాలోని దేవీ, నిమజ్జనోత్సవంలోనే ఆ హెరాయిన్ పంపిణీ జరగాలి!'

తాను గాలిలో బాణం వదులుతున్నానని అతనికి

తెలుసు. కాని, మరో మార్గం కనిపించలేదతనికి.

ఒక నిశ్చయానికి వచ్చినట్లు పార్కు బయటకు నడిచాడతడు. జరిగినదంతా కొద్ది క్షణాల క్రితమే వైర్ లెస్ సెట్ ద్వారా రిపోర్టు చేసి వస్తున్నాడతడు.

పార్కు బయట రోడ్డుకు ఓ ప్రక్కగా పార్కు చేయబడ్డ స్పోర్ట్సు కారును సమీపించాడు. తలుపును తెరిచి, స్టీరింగ్ ముందు కూర్చుని, కారును స్టార్టు చేశాడు.

ఒక చింకిపాతల బిక్షగాడు ఖరీదైన స్పోర్ట్సు కారును డ్రయివ్ చేయటం చూస్తే ఎవరైనా ముక్కున వ్రేలేసుకుంటారు అనుమానిస్తారు.

కాని, ఇప్పుడతనేమీ పట్టించుకొనే స్థితిలో లేడతడు. అతని సారథ్యంలో....శర వేగంతో పాలం ఎయిర్ పోర్టు ఏరియావైపు దూసుకుపోతూంది ఆ స్పోర్ట్సు కారు.

అక్కడ... మ్యూజియంలో ...

'ఎంత సేపు ఇలా చీకటిలో యెదురు చూడటం?' అనుకున్నాడు సలీం అసహనంగా.

'కనుపించని శత్రువుకు భయపడి, ఇలా చీకటిలో దాక్కొని వుంటే, ఈలోగా బ్లడ్ హౌండు అరుపులకు గార్డ్సు రియాక్టయి, వెతకటం ప్రారంభిస్తే....! తాము త్రవ్విన సొరంగం దారి కంటబడితే....!' — ఆపైన ఆలోచించలేక అనీజీగా కదిలాడు లాల్.

అతని అనుమానం అక్షరాలా నిజమైంది.

'సొరంగం, దాని ప్రక్కనే పడి వున్న డ్రిల్లింగ్ మిషన్, సొరంగంలోనుండి వినవస్తున్న బ్లడ్ హౌండ్ అరుపులు....' — శత్రువులు మ్యూజియంలో ప్రవేశించారని క్షణంలో గ్రహించారు ఆ గార్డ్సు.

విషయం పోలీసుల వరకూ ప్రాకింది.

అంతే!

మరుక్షణం నుండి గార్డ్స్ కేకలతో, పోలీసుల విజిల్స్‌తో ఆ మ్యూజియం ఆవరణ మారుమ్రోగిపోయింది.

ఆ కేకలు, ఈలలు వినిపించగానే తృళ్ళిపడ్డారు.... సలీమ్, లాల్. 'ఇక తెగించాలి' అనుకున్నారు వారు ఎవరికి వారే!

చేతిలోని టార్చిని నేలమీద ఉంచి, స్విచ్‌ను ఆన్ చేసి, తను ఛటాక్కున స్తంభం చాటుకు తప్పుకున్నాడు లాల్.

అతని ఎత్తు ఫలించింది.

టార్చ్ వెలిగిన మరుక్షణం సలీమ్ చేతిలోని గన్ గర్జించింది. అయితే అక్కడ లాల్ లేకపోవటంలో వెనుకనున్న అద్దాల బీరువాను ధ్వంసం చేశాయి ఆ తుపాకి గుళ్ళు.

ఆ దేక్షణంలో చేతిలో సిద్ధంగా ఉంచుకున్న డాగర్‌ను తుపాకీ ప్రేలిన సలం వైపు బలంగా విసిరాడు లాల్.

అతని గురి తప్పలేదు.

సూటిగా వెళ్ళి. సలీం భుజంలో దిగబడిందా బాకు.

'అమ్మా' అంటూ బాధగా అరుస్తూ నేలపై కూలబడ్డాడతడు.

ఆ దెక్షణంలో.... లాల్ చేతిలోని రివాల్వర్ నిప్పులు గ్రక్కింది.

తన రివాల్వర్‌కు సైలెన్సర్ లేదనీ, అది మ్రోగిన మరుక్షణం గార్డ్స్‌కు తమ ఉనికి తెలిసిపోతుందని అతనికి తెలుసు. 'కాని తప్పదు. తను తొందర పడకుంటే, అటువైపునున్న శత్రువు తన ప్రాణాలను తీసేట్టున్నాడు'

అనుకున్నాడతడు రివాల్వర్‌ను ప్రయోగిస్తూ.

కాని, సలీం నేలమీద కూలబడటం వలన, ఆ రివాల్వర్ బుల్లెట్ వెనుకనున్న గోడకు తగిలింది.

క్రిందపడ్డ సలీమ్ ఖాళీగా కూర్చోలేదు. గన్‌ను సిద్ధంగా పట్టుకున్నాడు. భుజానికయిన గాయంలోనుండి రక్తం కారుతూంది. భుజం విపరీతమయిన సలుపు పెడుతూంది. అయినా పళ్ళ బిగువున ఆ బాధనంతటినీ ఎలాగో సహిస్తున్నాడతడు.

ఎప్పుడయితే లాల్ రివాల్వర్ ప్రేల్చాడో మరుక్షణం ఆ శబ్దాన్ని బట్టి గన్‌ను గురిపెట్టి ట్రిగ్గర్ నొక్కాడు అతడు.

ఈసారి అతని గురి తప్పలేదు.

లాల్ కాలర్ బోన్‌లోనుండి దూసుకు పోయిందా తుపాకీ గుండు. భరించలేని బాధతో ఆర్తనాదం చేస్తూ వెనక్కు విరుచుకు పడిపోయాడు లాల్. చేతి వేళ్ళ పట్టు సడలి, అతని చేతిలోని రివాల్వర్ నేలపైకి జారి పోయింది.

శబ్దాన్ని బట్టి తన శత్రువు నేలకూలాడని గ్రహించాడు సలీమ్. రివాల్వర్ నేలమీదపడి 'ఖంగు'న మ్రోగిన శబ్దాన్ని విన్నాక, శత్రువు నిరాయుధుడని తేలాక నిర్భయంగా లేచి నిలబడ్డాడు.

జేబులోనుండి పెన్ టార్చ్‌నుతీసి వెలిగించాడు. నిజాం నగలు వుంచబడ్డ గ్లాస్ కేస్ యెక్కడుందో అతనికి తెలుసు. చక, చకా అడుగులు వేసుకుంటూ అటువైపు నడిచాడతడు.

హాలుకు కుడివైపున వుందొక ప్రత్యేకమైన గది. అత్యంత విలువైన పురాతన వస్తువులు అందులో వుంచ

బడతాయి.

ఆ గది ముందు ఆగాడు సలీమ్.

ఆ గది తలుపులకు పెద్ద తాళం వ్రేలాడుతూంది. తుపాకీని ప్రేల్చి క్షణంలో ఆ తాళాన్ని విడగొట్టాడు అతడు. తలుపులను మెల్లగా తెరిచాడు. టార్చ్‌ను లోపలకు ఫోకస్ చేశాడు.

గది మధ్యనున్న పెద్ద గ్లాస్ కేస్‌లో నీట్‌గా పేర్చబడి వున్నాయి నిజాం నగలు. వాటి మధ్య చుక్కల్లో చంద్రునిలా మెరిసిపోతూంది అపూర్వమైన జాకబ్ డైమండ్!

ఒక్క పరుగున ఆ కేస్‌ను సమీపించి ఆత్రంగా దానిపై చేయి వేశాడతడు.

అంతే!

చెవులు చిల్లులుపడేలా వినిపించిందొక సైరన్ మ్రోత! గుప్పుమంటూ ఆ గదిలోని లైట్లు వెలిగాయి.

జరిగిందేమిటో అర్థంకాక క్షణకాలంపాటు నిశ్చేష్టుడైపోయాడు సలీమ్.

10

అఘ మేఘాలపై, రాకెట్‌లా దూసుకొంటూ పోయి ఎయిర్ పోర్టు ఏరియాను చేరుకున్నాడు ఆ భిక్షగాడు.

కాని.... ఆ ఏరియా అంతా నిర్మానుష్యంగా వుంది. పెళ్ళివారు ఖాళీచేసిన విడిది యింటిలా కళావిహీనంగా వుంది. పందిళ్ళూ, షామియానాలూ, ఒకటి, రెండు విద్యుద్దీపాలూ మాత్రం.... అక్కడ దేవీ నవరాత్రోత్సవాలు జరిగాయన్న దానికి సాక్ష్యాలుగా నిలిచి వున్నాయి.

'అంటే.... ఊరేగింపు వెళ్ళిపోయిందన్నమాట!' అనుకున్నాడతడు తలను పంకిస్తూ.

ఉత్సవం యొక్కడ, యే ప్రాంతంలో జరిగినా నిమజ్జనం మాత్రం ఢిల్లీ నగర శివార్లలో ప్రవహిస్తున్న యమునా నదిలో జరుగాల్సిందే!

అయితే....కనీసం అర్ధరాత్రి వరకైనా జరగాల్సిన ఊరేగింపును ఇంత అర్ధాంతరంగా ఆపేసి, అంత హడావుడిగా యమునా తీరానికి తరలి వెళ్ళిపోయారెందుకు?

'అంటే తన అనుమానమే నిజం కాబోతున్నదా?' ఆలోచనలో పడ్డాడతడు.

హెరాయిన్ పంపిణీ.....ఇక్కడే ...! ఎయిర్ పోర్టు ఏరియాలోనే జరిగేటట్లుంటే, ఇంత తొందరగా ఊరేగింపును ముగించి, యమునా నదీ తీరానికి పరుగులు తియాల్సిన అవసరం లేదు.

అదీగాక....పోలీసులనూ, భక్తులనూ ఏమార్చి విద్యుద్దీపాలతో వెలిగిపోయే ఈ ఊరేగింపులో రిస్క్ తీసుకోవడం కంటే, నిర్మానుష్యమైన యమునా నదీతీరాన చీకటిలో ఆ చీకటి వ్యాపారాన్ని పూర్తిచేసుకోవటం వారికి సులువు.

సో! తన అనుమానమే నిజమైతే ఆ హెరాయిన్ పంపిణీ ఖచ్చితంగా యమునానదీ తీరంలోనే జరగాలి!' అనుకున్నాడతడు.

దెన్....ఎలా జరుగుతుంది?

ఒకసారి తనే బలరామ్ స్థానంలో వుంటే....ఏం చేసేవాడో ఊహించుకున్నాడు....అతడు.

అంతే!

మంచులా విడిపోయింది అతని మనసును పట్టిపీడిస్తున్న అతని సందేహం!

మెదడు పొరలలో తటిల్లతలా మెరిసిందొక ఆలో

చన. సన్నని చిరునవ్వుతో అతని పెదవులు విచ్చుకున్నాయి.

ఏక్సిలేటర్‌ను పాదంతో బలంగా అదిమాడు. వింటిని విడిచిన బాణంలా కారు సర్రున దూసుకుపోయింది.

ఒక చేత్తో స్టీరింగ్‌ను కంట్రోల్ చేస్తూ .... మరో చేత్తో జేబులోంనుండి కార్ లెస్ సెట్‌ను బయటకుతీశాడు.

కాంటాక్టు చేయబడ్డ వ్యక్తి లైన్‌లోనికి రాగానే మెల్లగా చెప్పటం ప్రారంభించాడతడు....

అక్కడ....

మ్యూజియంలో....

విద్యుత్ సరఫరా నిలిపి వేయబడ్డ మ్యూజియంలో— ఆ గ్లాస్ కేసును తాకేసరికి ఎలక్ట్రిక్ అలారమ్స్ ఎలా మ్రోగినట్లు? మ్యూజియంలో అంతా అంధకారంలో మగ్గిపోతూండగా ఒక్క ఈ గదిలోని లైట్లు మాత్రం ఎలా వెలిగినట్లు?'

— ఏం జరిగిందో, ఎలా జరిగిందో అర్థంకాని అయోమయ స్థితిలో వున్నాడు సలీమ్.

అంతలో....అతని వెనుక చిన్న అలికిడి అయినట్లనిపించింది. గిరుక్కున వెనుతిరగబోయాడు అతడు.

కాని, అంతలో అతని వెన్నుకు బలంగా గుచ్చుకొందొక ఇనుప గొట్టం. అది రైఫిల్ బారెల్ అని గ్రహించడానికి సలీంలాంటి ప్రొఫెషనల్ క్రిమినల్‌కు ఎన్నో క్షణాలు పట్టలేదు.

తను కదలిన మరుక్షణం ఆ రైఫిల్ పేలుతుందని, ఆ గుండు తన వెన్నును చీల్చుకుంటూ, గుండెలలో నుండి దూసుకుపోతూందని....అతనికి వేరే మాటలతో చెప్పా

ల్సిన పని లేకపోయింది.

బుద్ధిగా చేతులను పైకెత్తి కదలకుండా నిలబడ్డా డతడు.

"అది బుద్ధిమంతుల లక్షణం సలీమ్,

ఇక, నీ సందేహాలకు సమాధానం చెబుతాను విను.

ఈ గదికి ప్రత్యేకంగా బ్యాటరీ పవర్ ఏర్పాటు చేశాం. మ్యూజియం అంతటా మీ దయావలన పవర్ సప్లై పోయినా, ఈ గదిలో మాత్రం పవర్ సప్లై యథాతథంగా వుంది. కాకుంటే, ఎలాగూ నిజాం నగల కోసం మీరు ఈ గదికి వస్తారని తెలుసు కాబట్టి, మీకు స్వాగతం పలకడానికి ఈ గదిలోని లైట్లను ఆఫ్ చేసి. చీకటిలో కాచుకుకూర్చున్నాను."

గంభీరంగా వినవచ్చిన గొంతును పోల్చుకునేసరికి, సలీమ్ ముఖం తెల్లగా పాలిపోయింది.

తన వెనుక నిలబడినది....ఢిల్లీ పోలీస్ కమీషనర్ అని తెలిశాక, అతని కర, చరణాలు పనిచేయడం మానేశాయి.

'డామిట్!

ఇతర పోలీస్ అధికార్లకు ఈ పనిని ఎంట్రస్టు చేస్తే ఆ విషయం యెలాగూ తమ మాఫియా రింగ్‌కు తెలిసి పోతుందని, తనే స్వయంగా వచ్చి కాపు కాసాడన్న మాట....దుర్మార్గుడు!'

—మనసులోనే తిట్టుకుంటూ నిస్సహాయంగా పళ్ళు నూరాడతడు.

అదే సమయంలో....

బూట్లను టక టక లాడించుకుంటూ ఆ గదిలోనికి ప్రవేశించారు పోలీసులు.

"టేక్ హిమ్ అవుట్!

అక్కడ మెయిన్ హాలులో మరో వ్యక్తి గాయమై పడివున్నాడు. వాడిని కూడా!" గంభీరమైన కంఠంతో ఆజ్ఞను జారీచేశాడు పోలీస్ కమీషనర్.

11

యమునానదీ తీరానికి కాస్త దూరంలో రోడ్డు ప్రక్కనున్న పొదలమాటున కారును పార్కు చేసి క్రిందకు దిగాడా భిక్షుగాడు.

ఒకసారి చూపులను ముందుకు సారించాడు.

చీకటితెరల మధ్య బద్ధకంగా వళ్ళు విరుచుకుంటున్న శ్యామలాంగనలా వుంది యమునా నది.

తీరం వెంబడి విశాలంగా వ్యాపించిన ఇసుకతిన్నెలపై జనం గుంపులుగా నిలుచుని వున్నారు. కాస్త దూరంలో ఆగివున్న ఉత్సవ రథం. మిణుకు మిణుకు మంటున్న దీపపు కాంతిలో అస్పష్టంగా కనిపిస్తూన్న దేవి విగ్రహం....వారు దేవీ నవరాత్రోత్సవ బృందం అని సులువుగా పోల్చవచ్చు.

'అయితే యింత వేగంగా మరే ఉత్సవ బృందం కూడా యమునా తీరానికి చేరుకోరు కాబట్టి ఆ కన్పి స్తున్న బృందమే తనకు కావాల్సిన పాలం ఎయిర్ పోర్టు ఏరియా ఉత్సవ బృందం అయివుంటుంది' అనుకున్నాడతడు, ముందుకు అడుగు వేస్తూ.

ముందుకు నడిచేకొద్దీ వారు మరింత స్పష్టంగా కన్పి స్తున్నారు.

అంతవరకూ ఆడి పాడి అలసిపోయిన వేషగాళ్ళూ, వాయిద్యగాళ్ళూ ఉత్సవరథం ముందు ఇసుకలో చేర బడి విశ్రాంతి తీసుకుంటున్నారు.

పెద్ద పెద్ద ఇత్తడి పళ్ళేరాలలో నున్న ప్రసాదాన్ని కూడా వచ్చిన భక్తులకు పంచుతున్నారు కొందరు కార్య కర్తలు.

ఉత్సవ రథం నుండి దేవీ విగ్రహాన్ని దించి నదిలో నిమజ్జనం చేయడానికి తోడ్కొని తీసుకువెళ్తున్నారు యువకులు.

"విగ్రహం చాలా బాగుంది భాయి!" అన్నాడా భిక్షుగాడు వారితో పాటుగా తనూ నడుస్తూ.

'కాలువంతా తీరాక, తీరా నీట కలిసే ముందా దీని అందం నీ కంటబడింది ముసలాడా!' అంటూ ఎకసెక్కా లాడుతూ...'అయినా బలరామ్ బాపూజీ ప్రత్యేకంగా తయారు చేయించి విరాళమిచ్చిన విగ్రహమా....మజాకానా. అందంగా ఉండకపోవటానికి' అన్నాడో కార్యకర్త....ఆ భిక్షుగాణ్ని ఓ వెర్రివాణ్ని చూసినట్లు చూస్తూ.

తన అనుమానం నిజమైనందుకు మనసులోనే సంతోషిస్తూ, ముఖంలో యే భావమూ బయల్పడకుండా జాగ్రత్త పడుతూ....నిర్వికారంగా వారి వెంట నడిచాడు ఆ భిక్షుగాడు.

మొలలోతు వరకు వెళ్ళాక, మరో మూడు అడుగులు ముందుకు వేసి ఆగారు వారు. అక్కడ సుమారు గుండెల వరకూ వస్తూంది నీరు.

భిక్షుగాడు ఒక్కసారి చుట్టూ కలియజూశాడు. నది మధ్య వారికి కాస్త దూరంలో మెల్లగా కదులుతూందొక నల్లని ఆకారం.

అది పడవ అని గ్రహించగానే అతని భృకుటి ముడి పడింది.

'అర్ధ రాత్రిపూట అంకమ్మ శివాలులా ఇంత రాత్రి పూట యమునా నదిలో పడవను నడుపుతూంది యెవరు?' అనుకున్నా డతడు దానికంటే సాలోచనగా చూస్తూ.

ఒక్కసారిగా గొంతెత్తి. పెద్దగా జయ జయ ధ్వానాలను చేస్తూ, మెల్లగా భక్తిప్రపత్తులతో ఆ దేవి విగ్రహాన్ని ఆ పావన నదీజలాలలో నిమజ్జనం చేశారు వారు.

జరిగే తంతునంతా ఓ వంక చూస్తూనే మరో వంక ఓరకంటితో ఆ పడవనే గమనించసాగాడు ఆ భిక్షు గాడు.

విగ్రహాన్ని నీటిలో ముంచిన మరుక్షణం ఆ పడవలో నుండి నాలుగు ఆకారాలు మెల్లగా చప్పుడు చేయకుండా నీటిలోకి జారుకోవడం అతని కంటపడింది.

నీటివాలుకు కొట్టుకు వస్తున్న యేవో నల్లని గుండ్రటి వస్తువుల్లా వారి తలలు మాత్రం నీటిపైన కన్పిస్తున్నాయి. వారు ఈదుకుంటూ తమవైపే వస్తున్నారని గ్రహించి సాలోచనగా తల పంకించాడతడు.

విగ్రహాన్ని నీటిలో నిమజ్జనం చేశాక, తాము కూడా భక్తితో మూడుసార్లు నీటిలో తలారా మునిగి, ఆ తరువాత ఒడ్డుకు నడిచారు ఆ ఉత్సవ కార్యకర్తలు.

వారితోపాటుగా తాను కూడ నీటిలో మునిగాడా భిక్షుగాడు. అయితే మూడోసారి మునిగాక, మరి నీటిలో నుండి పైకి లేవలేదతడు.

అనామకుడయిన అతడిని గమనించినవారు లేరు! అతని గురించి పట్టించుకునేవారూ లేరు!

నీటిలో చక్కర్లు కొడుతున్న అతనికి విగ్రహాన్ని

సమీపిస్తున్న ఆ నలుగురు వ్యక్తులు కనిపించారు. వారు పడవలో నుండి వచ్చిన మనుషులు.

వారు స్విమ్మింగ్ సూట్లను ధరించారు. తలలకు హెల్మెట్స్‌లాంటివి పెట్టుకున్నారు. వీపుపై ఆక్సిజన్ సిలిండర్స్‌ను పెట్టుకున్నారు. ఇద్దరి చేతులలో వాటర్ గన్స్ ఉన్నాయి.

"హా! వీరన్నిటికీ సిద్ధపడే వచ్చారన్న మాట!" అనుకున్నాడతడు.

తన అనుమానం నిజం కాదేమోనన్న శంక యేమైనా అతని మనసులో మిగిలివుంటే, స్విమ్మింగ్ సూట్లను ధరించి, మాడ్రన్ వెపన్స్‌ను చేపట్టి వస్తూన్న వారిని చూశాక.........ఆ అనుమానం కాస్త పటాపంచలై పోయింది.

'స్విమ్మింగ్ సూట్లనూ ఆక్సిజన్ సిలిండర్స్‌నూ ధరించినవారు యెంతసేపైనా నీటిలో ఉండగలరు. అందునా వారి చేతులలో వాటర్ గన్స్ కూడా వున్నాయి.

ఈ స్థితిలో నిరాయుధునిగా నీటిలో వారిని ఎదుర్కోవడమంటే ప్రాణాలపై ఆశను వదులుకోవడమే!

అయితే ఏం చేయాలి!

ఎలా వారిని అడ్డుకోవాలి?' ఆలోచించసాగాడతడు.

అంతలో వారు విగ్రహాన్ని సమీపించారు.

అప్పుడు స్ఫురించిందొక ఆలోచన అతనికి.

'నీటిలోనంటే వారిని యెదుర్కోవడం కష్టం! కాని, నీటి బయట?

అంటే....ఎక్కడ?

నీటిలో నుండి ఆ విగ్రహాన్ని బయటకు తీసి, ఆ పడవ

లోనికి చేరుస్తారు వారు. మరి ఆ పడవనే చేజిక్కించుకుంటే! బోటులో పాగా వేస్తే!

'ఇక్కడ... నీటిలో ఉంటే విగ్రహాన్ని తేవాలి కాబట్టి నలుగురు వచ్చారు కాని ఆ పడవలో వాళ్ళు వుంటే ఒకరో ఇద్దరో వుంటారేమో!'

ఆ ఆలోచన స్ఫురించాక ఒక్క క్షణం కూడా వృధా చేయలేదతడు. వడివడిగా ఈదుకుంటూ ఆ పడవను సమీపించాడు.

అతని అంచనా నిజమయ్యింది. ఆ పడవలో ఒకే ఒక వ్యక్తి కూర్చుని వున్నాడు.

జలభూతంలా ఒక్కసారిగా ఆ నీటిలో నుండి పైకి లేచిన ఆ భిక్షుగాడ్ని చూసి అదరిపడ్డాడా వ్యక్తి. అతడు తేరుకొనే లోగానే అతడిమీదకు లంఘించాడా భిక్షుగాడు. అరచేతిని కత్తిలా బిగించి మెడపై బలంగా మోదాడు.

అంతే!

అచేతనంగా పడిపోయాడా వ్యక్తి. పెట్టుడు గడ్డాన్నీ మీసాన్నీ పీకిపారేసి, చకచకా ఆ వ్యక్తి బట్టలను ఊడదీసి, వాటిని తాను ధరించాడతడు. ఆ వ్యక్తి తలపై నున్న కేప్ ను తీసి తాను పెట్టుకున్నాడు.

తరువాత అతని శరీరాన్ని యుక్తి నీటిలోకి జారవిడిచాడు. 'ఎంత లేదన్నా, అతనికి తెలివిరావడానికి మరో రెండు గంటలు పడుతుంది. నీటిలో మునిగిన అతడు అంతవరకూ బ్రతికివుంటాడా?' అనేమీ ఆలోచించే స్థితిలో లేడతడు.

అదే సమయంలో ఆ విగ్రహాన్ని మోసుకుంటూ మిగిలిన నలుగురు వ్యక్తులూ బోటును చేరుకున్నారు. అందరూ

ఎక్కాక బోటును స్టార్టు చేశాడతడు.

సముద్రాన దూసుకుపోసాగిందా బోటు.

విగ్రహాంవంక చూస్తూ హాయిగా నవ్వుకుంటున్నారు వారు.

అంతలో యేదో ఇంజన్ రొద వినిపించేసరికి ఉలిక్కిపడ్డారు వారు. నల్లని జీమూతంలా ఎదురుగా వస్తూన్న పెద్ద మోటార్ బోటు వంక ఆందోళనగా చూశారు వారు.

"పోనీ భాయ్! వేగంగా పోనీ!" కంగారుగా అరిచాడొకడు.

వారి బోట్ టక్కున బ్రేకులు వేసినట్లు ఆగిపోయింది.

"ఏం జరిగింది భాయ్?" కంగారుగా అడిగాడు మరో వ్యక్తి.

"ఏం జరుగలేదు ఫ్రెండ్స్! నేనే ఇంజన్ను ఆఫ్ చేశాను" కూల్ గా సామాధానం యిస్తూ వారివంక తిరిగాడతడు.

అతని చేతిలోని రివాల్వర్ వారివంక ఆకలిగా చూస్తోంది.

అతనివంక నిశ్చేష్టులై చూశారు వారు.

అదే క్షణంలో....ఆ మోటారుబోటు వారి బోటు ప్రక్కగా వచ్చి ఆగింది. దాని డెక్ పై రైఫిల్స్ను బారు చేసి నిలబడివున్న పోలీసులను చూడగానే....తప్పించుకుందామన్న ఆశ వారిలో నశించిపోయింది.

మోటార్ బోట్ ముందుసీట్లో దర్జాగా కూర్చున్న సి. బి. ఐ. చీఫ్ కరుణాకర్ వంక ఆనందంగా చూశాడతడు.

ఆ నలుగురూ యేమీ ప్రతిఘటించకుండానే పోలీసు

లకు లొంగిపోయారు.

'ఎదిరించి ప్రాణాలను కోల్పోవడం కన్నా. ప్రతి ఘంటే బలుసాకును తినైనా ప్రాణాలను నిలుపుకోవడం మిన్నని' అనుకున్నారు వారు.

విగ్రహంతో సహా ఆ నలుగురూ మోటార్ బోటులోకి చేర్చబడ్డారు.

విగ్రహం అడుగుభాగాన్ని జాగ్రత్తగా ఊడదీసాడతడు. తెల్లని పొడరున్న చిన్న చిన్న పోలిథిన్ పేకట్లు జల జల మంటూ ఆ విగ్రహంలో నుండి జారి పడ్డాయి.

అంతా విప్పారిన నేత్రాలతో వాటి వంకే చూస్తున్నారు.

"వెల్ డన్ రాంకుమార్!

నాకు తెలుసు. నీవు సాధించి తీరతావని...."
ప్రశంసాపూర్వకంగా అతని భుజాన్ని తట్టారు సి. బి. ఐ. చీఫ్ కరుణాకర్.

పెట్టుడు గడ్డాన్నీ, మీసాన్నీ తీసేసినా, భిక్షుగాని వేషపు గురుతులుగా యింకా మిగిలిపోయిన పెట్టుడు కనుబొమలను తీసుకుంటున్న రాంకుమార్ ఆ పొగడ్తల భారాన్ని మోయలేక తలదించుకున్నాడు.

"నిజాం నగల చోరీకి ప్రయత్నించిన దొంగలు కమీషనర్ చేత జిక్కారు. నూరు కోట్ల విలువచేసే హెరాయిన్ మన చేత చిక్కింది.

కాని, దీని కంతటికీ మూలకారకుడైన బలరామ్ మాత్రం హాయిగా ఉన్నాడు. నేరస్థుడని తెలిసికూడా అతనిని ఏం చేయలేకపోతున్నాం!"—బాధగా తల విదిలిస్తూ అన్నాడు కరుణాకర్.

'పాపాలనుబట్టి శిక్షలను విధించే చట్టం అమలులోనున్న న్యాయవ్యవస్థగల ఈ దేశంలో....

న్యాయాన్ని చట్టాన్ని.... ఆఖరికి ప్రభుత్వాన్ని కూడా గుప్పిటలో పెట్టుకోగల బలరామ్‌లాంటి మాఫియా గ్యాంగ్ లీడర్లు ...నర వ్యాఘ్రాల్లా ఈ జనారణ్యంలో స్వేచ్ఛగా సంచరిస్తూనే వుంటారు' అన్నాడు రాంకుమార్, ఒక వేడి నిట్టూర్పు విడుస్తూ!

—: అయిపోయింది :—